www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
బుధవారం 02 ఏప్రిల్ 2025
సంపుటి :06 సంచిక : 301 , పేజీలు : 12 వెల:రూ.5/-
తెలుగు దినపత్రిక
TELANGANA, ANDHRA PRADESH



### బీజేపీ ఎమ్మెల్యే ల అరెస్టులను ఖండించిన ఏబీవీపీ నేతలు



2 లో..

## హెచ్‌సియూ భూ వివాదంపై
# ప్రభుత్వం దృష్టి

- మంత్రులతో సింఎం రేవంత్ సమీక్ష
- విపక్షాల విమర్శలకు స్పష్టమైన సమాధానం
- బిల్లీరావు చేతిలో ఉన్న భూములను కొట్లాడి సాధించాం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు





**హైదరాబాద్,ఏప్రిల్1( వెలుతురు):** హెచ్‌సియూ భూ వివాదంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ విషయంలో నిజానిజాలను ప్రజల ముందుంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం రేవంత్ అధ్యక్షతన పలువురు మంత్రులు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీలో పూర్వాపరాలను చర్చించారు. అనంతరం మంత్రులు భట్టి, శ్రీధర్ బాబులు సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన ఆస్తి, ఒక అంగుళం భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడంలేదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విషయంలో కొంతమంది వ్యక్తులు, కొన్ని పార్టీలతో అనుసంధానంగా ఉన్న సంఘాలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీ భూమి వర్సిటీకే ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పనికి అడ్డుతగిలితే ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. సచివాలయంలో నిర్వహించిన మంత్రుల మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. కంచె గచ్చిబౌలి భూములపై బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హెచ్ సీయూ ఇంచు భూమి కూడా ప్రభుత్వం తీసుకోలేదన్నారు. హెచ్ సీయూ భూములను గుంజుకుంటున్నారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు

2 లో..

## లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయ్

- హెచ్‌సీయూ భూములపై రామేశ్వరరావు కన్ను
- హెచ్‌సీయూ భూములపై ఆనాడు కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదు

### ఘాటుగా స్పందించిన టీపీసీసీ మహేశ్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్1( వెలుతురు):** హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్ని యూనివర్సిటీల భూములపై సర్వే వేయించి కాపాడాలని ముఖ్యమంత్రికి రిక్వెస్ట్ చేస్తానన్నారు. లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయన్నారు. హెచ్‌సీయూ కోసం ఇందిరా గాంధీ 2500 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. కేటీఆర్, కిషన్ రెడ్డి చేతిలో

2 లో..



## శాతవాహన వర్శిటీకి 'లా కాలేజీ'ని మంజూరు చేయండి

- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ కు బండి సంజయ్ వినతి
- వర్శిటీ వీసీ, మాజీ మేయర్ లతో కలిసి అరగంటకుపైగా న్యాయశాఖ మంత్రితో భేటీ
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- వచ్చే విద్యా సంవత్సరం నుండే కోర్సులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం

**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 01:** కరీంనగర్ లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కోరారు. శాతవాహన వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావులతో కలిసి బండి సంజయ్ మంగళవారం రోజున మధ్యాహ్నం ఢిల్లీలో కేంద్ర మంత్రి

2 లో..

## హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ విధ్వంసం

- ఆభూములపై సుప్రీంకోర్టులో కేసులున్నాయి
- చదును పేరుతో కోర్టు ధిక్కారణ
- భూముల వేలం ప్రక్రియతో కాంగ్రెస్ అరాచకానికి పరాకాష్ట
- కేంద్రమంత్రి బండిసంజయ్ ఆగ్రహం



**హైదరాబాద్, ఏప్రిల్1( వెలుతురు):** కాంగ్రెస్ ప్రభుత్వం చెట్లను తొలగిస్తూ, మొక్కలను పీకేస్తూ

2 లో..

## రేవంత్‌లోనూ కెసిఆర్ అహంకారం...

- భూముల అమ్మకంతోనే పాలన సాగిస్తారా
- మండిపడ్డ ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



**హైదరాబాద్,ఏప్రిల్1( వెలుతురు):** తెలంగాణ ప్రభుత్వ భూ విక్రయ విధానంపై ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా సెంట్రల్ యూనివర్శిటీ భూముల అమ్మకంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిపాలన పరిస్థితులను చూస్తుంటే, కేసీఆర్ అహంకారం ఇప్పుడు రేవంత్ రెడ్డిలో కనిపిస్తోందని పాయల్

2 లో..

## ఢిల్లీ చేరుకున్న చిలీ అధ్యక్షుడు

### ప్రధాని మోడీతో భేటీ



2 లో..

## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను
# దిగ్విజయం చేస్తాం

- బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 1:**



వరంగల్ కు అవకాశమిచ్చినందుకు పార్టీ అధినేత కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపిన ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ శాఖ నాయకులు మంగళ వారం నాడు పార్టీ అధినేతతో సమావేశమైన వరంగల్ జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు.బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 వసంతాల సందర్భంలో జరుపుకుంటున్న రజతోత్సవ మహా సభ నిర్వహణ బాధ్యతలను తమ జిల్లాకు అప్పగించినందుకు వరంగల్ జిల్లా పార్టీ.. అధినేత కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపింది.ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు సంబంధించి, వరంగల్ జిల్లా ముఖ్య నాయకులంతా కలిసివచ్చి ఎర్రవెల్లి నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్ తో సమావేశమయ్యారు. సభా నిర్వహణకు సంబంధించి అధినేత

2 లో..

## బీసీలకు పట్టం కట్టింది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ

- బీసీ రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే
- యావత్ బీసీ సమాజం తరపున ప్రత్యేక ధన్యవాదాలు
- బీజేపీ నాయకులు బీసీల వైపా...అగ్రవర్ణాల వైపా?
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 01:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని నెరవేర్చినటువంటి కాంగ్రెస్ పార్టీ...బీసీల దశాబ్దాల కల అయిన బీసీ రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు యావత్ తెలంగాణ బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటుందని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో బీసీ సంఘాల నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీసీల పక్షపాతి అని, దేశ ప్రధాని పీఎం మోదీ కూడా బీసీ అని బీజేపీ నాయకులు గొప్పగా చెప్పుకుంటున్నారని, మరి ఇప్పుడు తెలంగాణలో బీజేపీ నాయకులు బీసీల వైపు ఉంటారో.... అగ్రవర్ణాల వైపు ఉంటారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ఎవరి పక్షాన నిలబడి పోరాడుతారోనని తెలంగాణ సమాజం అంతా గమనిస్తుందని చెప్పారు. పేదల వైపు ఉండి న్యాయం చేస్తారా లేక పెత్తందార్ల వైపు మొగ్గు చూపుతారా చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో కులగణన చేపడతామని చెప్పి మూడు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన

2 లో..

## పేదల ఇండ్ల కూల్చివేతకు వెళ్లిన బుల్డోజర్లు మళ్లీ హెచ్‌సీయూ భూముల స్వాధీనానికి..

- రేవంత్‌ది బుల్డోజర్ల పాలన అనటానికి ఇదే నిదర్శనం
- ఎందుకు కాంగ్రెస్‌కు పాలన అప్పగించామని అన్నివర్గాల మనోవేదన
- కాంగ్రెస్ పాలన తీరుపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్, మార్చి31( వెలుతురు):** అప్పుడు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్, ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని ఆయన పాలనలో కేవలం బుల్డోజర్లు తప్ప ఏమి కనిపించడం లేదని మాజీమంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్ర పరిస్థితి చూస్తుంటే అసలు కాంగ్రెస్‌కు ఎందుకు పాలన అప్పగించామంటూ అన్నివర్గాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. తొలుత పర్యావరణ పరిరక్షణ పేరుతో చాలా

2 లో..

## ప్రజలే ముందు..తరవాతే మిగతా పనులు

- అందుకే నేరుగా పేదలకు పెన్షన్ల పంపిణీ
- తెలంగాణ కంటే ఏపిలో పెన్షన్లు ఎక్కువ
- గతంలో బటన్ నొక్కిన దానికంటే పెన్షన్ డబ్బులే మిన్న
- పదిలక్షల కోట్ల అప్పు వారసత్వంగా వచ్చిపడింది
- కొత్తగొల్లపాలెంలో పెన్షన్లను పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు

**బాపట్ల,ఏప్రిల్1( వెలుతురు):** ప్రజలే ముందు.. ఆ తర్వాతే మిగతా పనులు అని స్పష్టం సిఎం చంద్రబాబు నాయుడు చేశారు. గతంలో బటన్ నొక్కామని చెప్పారు.. మా బటన్లు అన్నీ నా పెన్షన్‌తో సమానం. ప్రజా సేవల పేరుతో పెన్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టా. ముందుండి నడిపించాలనే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నా. పెన్షన్లు ఇచ్చేటప్పుడు గౌరవంగా ఇవ్వాలి. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఏపీ కంటే తక్కువ పెన్షన్లని అని తెలిపారు. మంగళవారం బాపట్ల జిల్లాలో పర్యటించిన సిఎం చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించిన ముఖ్యమంత్రి.. లబ్ధిదారుల

2 లో..



(మొదటి పేజీ తరువాయి..)

## బీజేపీ ఎమ్మెల్యే ల అరెస్టులను ఖండించిన ఏబీవీపీ నేతలు

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 1:**

ఇది అన్యాయం సీఎం రేవంత్ రెడ్డి.కార్పొరేట్ కంపెనీల యజమానుల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి లోని 4వందల ఎకరాల హెచ్ సీ యూ యునివర్సిటి భూములను అమ్మి విద్యార్థుల జీవితాలు నాశనం చేస్తావా అంటూ బీజేపీ పార్టీ ఎమ్మెల్యే లు ఏలేటి మహేశ్వరరెడ్డి, పాయల్ శంకర్ లు మండిపడ్డారు,మంగళ వారం నాడు ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ యూనివర్సిటీ లో ఉండే లక్షల చెట్లను నరికి వేస్తావా.అందులో వందల రకాల పక్షులు జంతువులు ,నెమలు లను సరస్సు లను లేకుండా చేస్తావా... అని వారు అడిగారు,ఇది అమ్మడం తప్పని పోరాటం చేస్తున్న ఏబీవీపీ HCU విద్యార్థులను పశువులను బాదినట్లు పోలీసులతో కొట్టిస్తావా అంటూ మహేశ్వర్ రెడ్డి,పాయల్ శంకర్ లు ప్రశ్నించారు,కాగా దీనికి మద్దతుగా అక్కడికి వెలుతున్న బిజెపి శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ను అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని ఏబీవీపీ నాయకులు మండిపడ్డారు ,కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాపం పండింది ఫలితం అనుభవిస్తారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు,

## శాతవాహన వర్శిటీకి 'లా కాలేజీ'ని మంజూరు చేయండి

అర్జున్ మేఘ్వాల్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ లో అరగంటకుపైగా కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు.

శాతవాహన వర్శిటీ పరిధిలో వచ్చే విద్యా సంవత్సరానికిగాను 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి గతంలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వర్చువల్ ద్వారా తనిఖీ నిర్వహించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వివరణలతో కూడిన నివేదిక కోరిందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపామని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల లా కోర్సుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్ వినతికి సానుకూలంగా స్పందించిన అర్జున్ మేఘ్వాల్ అందుకు అనుగుణంగా శాతవాహన వర్శిటీకి అనుబంధంగా సాధ్యమైనంత తొందర్లో లా కాలేజీకి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. అట్లాగే రాబోయే విద్యా సంవత్సరం(2025-26) నుండే లా కాలేజీ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు.

## లెక్కలు తీస్తే బొక్కలు విరుగుతాయ్

చెయ్యేసి చెప్పు బావ అనే లాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రామేశ్వర రావు కన్ను హెచ్‌సీయూ భూములపై పడిందన్నారు. కోర్టులో ఉన్న కారణంగా భూములను కొల్లగొట్టలేకపోయారని తెలిపారు. హెచ్‌సీయూ అన్యాక్రాంత భూముల్లో మై హోం విహంగ భవనం వెలిసిందంటూ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌సీయూ భూముల్లో మైహోం భవనాలు కట్టారని... అప్పుడు బీజేపీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అక్కడ రోడ్లు వేశారని చెప్పుకొచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ బినామీలకు భూములు ఇచ్చేపుడు వన్య ప్రాణులు కనపడలేదా అని నిలదీశారు. 534 ఎకరాలు ప్రభుత్వం తీసుకున్నందుకు గోపనపల్లిలో 397 ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించారని తెలిపారు. విద్యార్థులను రెచ్చగొట్టి కేటీఆర్ రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల భూములను కొల్లగొట్టింది బీఆర్ఎస్ నాయకులే అంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. క్యాబినెట్ విస్తరణపై అభిప్రాయాలు చెప్పామన్నారు. అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. తామిప్పటి వరకు ఎలాంటి తేదీలు చెప్పలేదని తెలిపారు. సాయంత్రం ఢిల్లీకి వెళ్తున్నామని.. బీసీ సంఘాల నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ విధ్వంసం

పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతోందని కేంద్ర మంత్రి బండిసంజయ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదని, అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీం కోర్టుతీర్పులున్నాయని ఆయన అన్నారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందని, వట ఫౌండేషన్ అనే ఎన్‌జీవో దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఆ భూములను వేలం వేయడం కుదరదని.. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం భూముల చదును పేరుతో కోర్టు ధిక్కారణకు పాల్పడుతోందని బండి సంజయ్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్ రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. కంచె గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట అని, తక్షణమే గచ్చిబౌలి భూముల అమ్మకంపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బండి సంజయ్ కుమార్ అన్నారు. కాగా కంచె గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిల్‌ను న్యాయస్థానం స్వీకరించింది. బుధవారం విచారణ జరగనుంది. ఆ 400 ఎకరాలు హెచ్‌సీయూ భూమి అని, అటవీ భూమిలో వన్య మృగాలకు ఆవాసం ఉండదని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ భూములను డీఫారెస్టైజేషన్ చేసి అమ్మి రూ. వేల కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ క్రమంలో వట ఫౌండేషన్ 400 ఎకరాల వివాదాస్పద భూముల వ్యవహారంపై ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసింది. కంచె గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని పిటిషన్‌లో కోరారు. అత్యవసరంగా పిటిషన్ స్వీకరించి విచారణ చేపట్టాలని వట ఫౌండేషన్ లాయర్ కోరారు. బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని న్యాయస్థానం పేర్కొంది.

## రేవంత్‌లోనూ కెసిఆర్ అహంకారం...

శంకర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, నాడు ఎంపీగా ఉన్నప్పుడు 'ప్రభుత్వ భూములు అమ్మకూడదు' అని చెప్పిన రేవంత్ రెడ్డి, నేడు ఏ అధికారంతో భూములను అమ్ముతున్నారని అంటూ నిలదీశారు. వేల ఎకరాల భూములను నాడు కేసీఆర్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని, ఇప్పుడు అదే విధానం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోం దని అన్నారు.. రాష్ట్రాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేయాలంటే భూములను అమ్మడం తప్పనిసరని రేవంత్ రెడ్డి భావిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. ధరణి పేరుతో కేసీఆర్ భూ దోపిడీ చేశాడు. ఇప్పుడు భూమాత పేరుతో కాంగ్రెస్ భూ దందాకు తెరలేపుతోంది. యూనివర్శిటీ భూములు ప్రభుత్వానివే కాకపోతే, అవి ఎవరివి? విద్యా సంస్థలకు సంబంధించిన భూములను అమ్మకానికి పెట్టడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు.యూనివర్శిటి భూములపై వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని హెచ్‌సీయూ వెళ్లినప్పుడు పోలీసులు మమ్మల్ని నిర్బంధించడం దారుణం అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలా అణిచివేత పాలన సాగిస్తారా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్శిటీ భూముల అమ్మకంపై రాజ్యసభలో కూడా ప్రస్తావించాం. భూముల లెక్కలు బయటపెట్టే వరకు బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తుంది. ప్రభుత్వం వెంటనే ఈ భూముల విక్రయ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

## ఢిల్లీ చేరుకున్న చిలీ అధ్యక్షుడు

**న్యూఢిల్లీ,ఏప్రిల్1( వెలుతురు):**

చిలీ అధ్యక్షుడు గాబ్రియేట్ బోరిక్ ఫాంట్ భారత్ పర్యటనలో భాగంగా ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధాని మోడీని ఆయన కలిశారు. ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు.కాగా, భారత్ పర్యటనలో భాగంగా ఫాంట్ ఢిల్లీలోని మహాత్మాగాంధీ రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'చిలీ మంత్రులు, పార్లమెంటు- సభ్యుల బృందం ఢిల్లీలోని మహాత్మాగాంధీ గౌరవార్థం నిర్మించిన రాజ్‌ఘాట్ వద్ద చేరుకుని ఆయనకు నివాళులర్పించాము. భారతదేశం ఆయన వారసత్వాన్ని గుర్తుచేస్తుంది. ఈ సందర్భంగా మేము ఉమ్మడి ఆసక్తులను పంచుకోవడమే కాదు.. మా ప్రజల భవిష్యత్తు కోసం గొప్ప అవకాశాలనే కాదు.. ప్రాథమిక విలువలను పంచుకున్నాము' అని ఫాంట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# హెచ్‌సియూ భూ వివాదంపై ప్రభుత్వం దృష్టి

వాస్తవాలు తెలియాలనే తమ ఆలోచన అని అన్నారు. 13 ,01,2004 వరకు ఆ భూములు హెచ్ సీయూవేనని చెప్పారు. ఆ తర్వాత 2004 లో బదలాయింపు కింద హెచ్ సీయూకి పక్కనే 397 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు . ఆనాటి ప్రభుత్వానికి హెచ్ సీయూ 400 ఎకరాలు ఇచ్చిందన్నారు. బిల్లీరావు అనే వ్యక్తి చేతిలో ఇన్ని రోజులు ఆ భూమి ఉందన్నారు భట్టి. ఆ భూమి తమదేనని బిల్లీరావు సుప్రీంలో రిట్ పిటిషన్ వేశారని చెప్పారు. 2014నుంచి2013 వరకు ఆ భూములను బీఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదని భట్టి ప్రశ్నించారు. వేల కోట్ల భూమిని 400 ఎకరాలు ప్రైవేట్ వ్యక్తికి ఎలా అప్పగిస్తాం. ప్రభుత్వ భూమి ఇంచు కూడా వెళ్లకూడదని కేబినెట్ నిర్ణయించింది. ఈ భూములపై కాంగ్రెస్ సర్కార్ పోరాడింది. హైకోర్టులో కొట్లాడి కేసు గెలిచాం. దశాబ్ద కాలం పోరాడి ఆ భూములను కాపాడినం. వేల కోట్ల విలువైన భూములను ప్రజలకు దక్కేలా చేశాం. ప్రజల కలలను నిజం చేసేందుకు మేం పోరాటం చేస్తున్నాం. మా ఆలోచన అంతా సంపదను సృష్టించడంపైనే. రాజకీయ స్వార్థం కోసం కొన్ని పార్టీలు కుట్ర చేస్తున్నాయి అని భట్టి అన్నారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని న్యాయపరంగానే తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హెచ్ సీయూ విద్యార్థులు ఆందోళన పడొద్దు..పార్టీల ప్రలోభాలకు లోనవద్దని సూచించారు. కంచె గచ్చి బౌలి భూములపై బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. 400 ఎకరాలు20 ఏండ్లుగా న్యాయపోరాటంలో ఉందన్నారు. వర్శిటీ విద్యార్థులు, సిబ్బందికి తాము విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. హెచ్ సీయూ భూమిలో ఇంచు భూమిని కూడా ప్రభుత్వం తీసుకోలేదన్నారు. వారం రోజుల క్రితమే హెచ్ సీయూ వీసీ,సబ్ రిజిస్ట్రార్ తో తాము సంప్రదింపులు జరిపామన్నారు. కొంత మంది వ్యక్తులు విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. తప్పుడు ప్రచారాలను ప్రజలకు చేరవేస్తున్నారు. 2016లో సీనియర్ ఐఏఎస్ అధికారితో కమిటీని వేశారు. గందరగోళం సృష్టించేందుకు బీఆర్ఎస్,బీజేపీ కుట్ర చేస్తున్నాయి. జీవ వైవిద్యానికి ఎలాంటి నష్టం కల్గించకుండా చూస్తాం. ప్రభుత్వ భూమిలో ఉన్న రాక్స్,లేక్ లను కాపాడుతాం. 2003లో ఆనాటి ప్రభుత్వం తప్పిదం చేసింది. 400 ఎకరాల ప్రభుత్వాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రైవేట్ వ్యక్తి చేతిలో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది అని శ్రీధర్ బాబు అన్నారు. వారం రోజుల క్రితం హెచ్‌సీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో ప్రభుత్వ పరంగా మేం సంప్రదింపులు చేశాం. వారికి స్పష్టంగా చెప్పాం. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించాలని భావించాం. వర్సిటీ భూమి వర్సిటీకే ఉండాలని వారికి తెలియజేశాం. 1500 పైచిలుకు ఎకరాల భూమి వారికి న్యాయపరంగా ఇచ్చేందుకు సిఫార్సులు చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని మీరు మీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చర్చించాలని సూచించాం. చట్టపరమైన అన్ని హక్కులు కల్పిస్తామని వారికి స్పష్టంగా చెప్పాం అన్నారు. గత రెండు రోజుల నుంచి కొన్ని మీడియా సంస్థలు, కొన్ని పార్టీలకు సంబంధించిన సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఈరోజు అక్కడ ఉన్న రాక్ ఫార్మేషన్స్, లేక్‌లు, ప్రసిద్ధి గాంచిన మష్రూమ్ రాక్స్, పికాక్ లేక్‌ను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. హెచ్‌సీయూ పరిసరాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడతాం. అవన్నీ ప్రభుత్వ భూముల్లో ఉన్నప్పటికీ వాటిని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటు-ంది. 400 ఎకరాల ప్రభుత్వ భూమిని న్యాయపరంగానే తీసుకుంటు-న్నాం. హెచ్‌సీయూ విద్యార్థులు ఆందోళనకు గురికావొద్దు. పార్టీల ప్రలోభానికి లోనుకావొద్దని అని శ్రీధర్‌బాబు తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను దిగ్విజయం చేస్తాం

నుంచి పలు సలహాలు సూచనలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మండలి ఎల్వోపి ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్ రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, తాటికొండ రాజయ్య, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మా రెడ్డి, రెడ్య నాయక్, శంకర్ నాయక్, గండ్ర వెంకట రమణ రెడ్డి, నన్నపునేని నరేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ రావు, గండ్ర జ్యోతి, నాగ జ్యోతి ఇతర వరంగల్ ముఖ్యనేతలతో పాటు మాజీ ఎంపీ సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎ. జీవన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా వరంగల్ నేతలు మాట్లాడుతూ..**

అధినేత ఆదేశాలతో ఉద్యమ సమయంలో కూడా అనేక భారీ సభలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేసినామని అన్నారు. వరంగల్ లో సభా నిర్వహణ పార్టీకి కలిసొచ్చే అంశమని తమ ఆనందం వ్యక్తం చేశారు.రజతోత్సవ మహా సభ నిర్వహణ కోసం ఇప్పటికే వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తి వద్ద 1,213 ఎకరాల స్థలాన్ని మహా సభకు అనువుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందులో 154 ఎకరాలు మహా సభ ప్రాంగణం ఉంటుందన్నారు. పార్కింగ్ కోసం 1,059 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు ఇందులో దాదాపు 50,000 ఎకరా వాహనాలు పార్కింగ్ చేసుకునే వీలుంటుంది అన్నారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్ల రజతోత్సవ సందర్భం కావడంతో కనీవినీ ఎరుగని రీతిలో మహసభను నిర్వహించనున్నట్టు వరంగల్ జిల్లా నేతలు తెలిపారు.రాష్ట్రం నలుమూలల నుండి పార్టీ కార్యకర్తలు కేసీఆర్ అభిమానులు తెలంగాణ వాదులు, ప్రజలు భారీ ఎత్తున తరలివస్తారని తెలిపారు. సభకు తరలివచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టినట్టు తెలిపారు.రజతోత్సవ మహాసభకు తరలివచ్చే ప్రజల కోసం 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లను, 10 లక్షల నీళ్ల బాటిళ్లను సిద్ధంగా వుంచనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ తదితర ఏర్పాట్లకు ఎటువంటి ఆటంకం కలగకుండా 1,500 మంది వాలంటీర్లను నియమించనున్నారు. అత్యవసర వైద్య సేవలను, అంబులెన్సు అందుబాటులో ఉంచనున్నారు.

**నాటి ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తాం**
**వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ**

నాటి ఉద్యమ రథసారథి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ స్వరాష్ట్ర కోసం సాగిన శాంతియుత పోరాటంలో అనేక సభలను నిర్వహించుకున్న ఘనత వరంగల్ గడ్డకు ఉన్నదని జిల్లా నేతలు తెలిపారు.ఆనాటి ఉద్యమ సమయంలో నిర్వహించిన విశ్వరూప మహాసభ విజయవంతమైన స్ఫూర్తితో రజతోత్సవ మహాసభను విజయవంతం చేసుకుంటామని వరంగల్ జిల్లా నేతలు ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ గడ్డ ముద్దుబిడ్డలు మహాకవి కాళోజీ నారాయణరావు, తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ జయశంకర్ సార్లు అందించిన ఉద్యమ స్ఫూర్తితో తిరిగి పార్టీ కోసం ప్రజల కోసం తమ కార్యాచరణను అమలు చేస్తామన్నారు. తెలంగాణ సాధన అనంతర కాలంలో కేసీఆర్ ఆధ్వర్యంలో సాగిన తొలి తెలంగాణ ప్రభుత్వ పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధిని సంక్షేమాన్ని తెలంగాణ ప్రజలకు అందించిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిదేనని వరంగల్ జిల్లా నాయకులు తెలిపారు. తెలంగాణ కైనా వరంగల్ కైనా కేసీఆరే శ్రీరామ రక్ష అనే విషయం మరోసారి. నిరూపిత మైపోయిందన్నారు.నాడు పదేళ్ల పాలనలో వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని వారు గుర్తు చేశారు.రెండు వేల ఎకరాల్లో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు చేసి, తెలంగాణ నేతన్నలకు ఉద్యోగ ఉపాధి కల్పించడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ వస్త్ర పరిశ్రమకు ఊతమిచ్చే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. హైదరాబాదులో ఉన్న సూపర్ స్పెషాలిటీ దవాఖానాలకు పోటీనిచ్చే రీతిలో 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం తమ పార్టీ ప్రభుత్వం హయాంలో వరంగల్లో ప్రారంభం కావడం గొప్ప విషయం అని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనిని తెలిపారు. వరంగల్ ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడం దగ్గర నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. వరంగల్ హనుమకొండ జంట నగరాలను అభివృద్ధి పరుస్తూనే జిల్లాలోని మారుమూల ప్రాంతానికి అభివృద్ధిని విస్తరించిన అంశాలను వారు గుర్తు చేశారు.అభివృద్ధిలో హైదరాబాద్ తో పోటీపడి విధంగా వరంగల్లును తీర్చిదిద్దన ఘనత కేసీఆర్ దేనని వారన్నారు.అంతేకాకుండా..సాగునీటి ప్రాజెక్టుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు, దేవాదుల పూర్తి, సమ్మక్క బరాజ్.. నిర్మాణం, హైదరాబాద్ తర్వాత తొలి ద్వితీయ శ్రేణి ఐటీ నగరంగా తీర్చిదిద్దటం, కాళోజీ కళా కేంద్ర నిర్మాణం, వరంగల్ కు పోలీస్ కమిషనరేట్ హోదా, ఉమ్మడి జిల్లాను పాలనా సౌలభ్యం కోసం ఆరు జిల్లాలు గా ఏర్పాటు, చెరువుల పునరుద్ధరణ కోసం చేపట్టిన బృహత్తర పథకానికి మిషన్ కాకతీయ గా పేరు, రాజముద్ర లో కాకతీయ కళా తోరణం మొదలైనవి ఉన్నాయన్నారు ,ఇట్లా చెప్పుకుంటూ పోతే ఎన్నో రకాలుగా వరంగల్ గడ్డకు కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషి మరువలేమన్నారు. తిరిగి కేసీఆర్ పాలనను తెలంగాణ ప్రజలకు అందించడం ద్వారా వరంగల్ జిల్లా కేసీఆర్ రుణం తీసుకోబోతుందని స్పష్టం చేశారు ,కేసీఆర్ ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకొని గాడిదప్పిన తెలంగాణ రైతన్నల సంక్షేమాన్ని అభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టడానికి వరంగల్ జిల్లా బిడ్డలంగా ముందు వరసలో ఉంటామని ప్రతినబూనారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి అధినేతకు బహుమతిగా అందజేస్తామని వరంగల్ జిల్లా పార్టీ ముక్త కంఠంతో ప్రకటించింది.

# పేదల ఇండ్ల కూల్చివేతకు వెళ్లిన బుల్డోజర్లు మళ్లీ హెచ్‌సీయూ భూముల స్వాధీనానికి..

మంది పేదల ఇండ్లను కూల్చివేశారని మండిపడ్డారు. ఆ తర్వాత అభివృద్ధి పేరుతో గిరిజన గ్రామాలను వెంబడించారని.. బంజరు భూములు, బల్లులు కూడా గుడ్లు పెట్టవు అన్నారని.. ఇప్పుడు మీరు జంతువుల గూళ్ళను వెంటాడి సామూహిక హత్యలు చేస్తారంటూ మండిపడ్డారు. విధ్వంసం మీ ఏకైక నినాదం! మీ ఖజానాను దాఖలు చేయడమే ఏకైక నినాదం.. నేను మిమ్మల్ని అడుగుతున్నాను రేవంత్ రెడ్డి.. మీ బుల్డోజర్లు వారాంతంలో, రాత్రిపూట ఎందుకు నిరంతరాయంగా పనిచేశాయి.. మీరు కోర్టుకు ఎందుకు భయపడుతున్నారు? మీరు ఏమి దాచారు? అంటూ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో హెచ్‌సీయూ భూముల్లో బుల్డోజర్లు చదును చేస్తుండడంతో అక్కడి అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో జింకలు అక్కడ ఏం జరుగుతుందో తెలియక ఆగమాగం అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. పెద్ద సంఖ్యలో అర్ధరాత్రి మోహరించిన బుల్డోజర్లతో నెమళ్లు అరుపులతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. కంచె గౌచ్చిబౌలిలోని హెచ్‌సీయూ సమీపంలో ఉన్న 400 ఎకరాల భూమిని ఇటీవల కాంగ్రెస్ అమ్మేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. ఆ స్థలాన్ని చదును చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున బుల్డోజర్లను మోహరించారు. చదును చేయడాన్ని విద్యార్థులు అడ్డుకున్నారు. ఆ భూమి యూనివర్సిటీదేనని పేర్కొంటున్నారు. ప్రకృతి విధ్వంసాన్ని ఆపాలని.. అక్కడ ఉంటున్న జీవరాశిని కాపాడాలని విద్యార్థులతో పాటు పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

# ప్రజలే ముందు..తరవాతే మిగతా పనులు

సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తగొల్లపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడుతూ... ప్రజలే ముందు.. ఆ తర్వాతే మిగతా పనులు అని స్పష్టం చేశారు. పెంచిన పింఛన్లను గత ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నాం. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్లు ఇస్తున్నాం. కోటిన్నర కుటుంబాలకు గానూ 64 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నాం. కొందరికి సంపాదించే దానికంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. పింఛన్ల పంపిణీ కోసం ఏడాదికి రూ.33,100 కోట్లు ఖర్చవుతోంది. ఒకప్పుడు నొక్కిన బటన్లన్నీ నేను ఇచ్చే పింఛన్లతో సమానం. పింఛన్ల రూపంలో నెలకు రూ.2,722 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గతంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే ఆ డబ్బు వచ్చే పరిస్థితి లేదు. ఒక నెల తీసుకోకపోతే.. రెండు లేదా మూడో నెల తీసుకునే అవకాశం ఇచ్చాం. రెండు నెలలు పింఛన్లు తీసుకోని వారు 93,300 మంది ఉన్నారు. మిగుల్చు కోవాలంటే నెలకు రూ.76 కోట్లు ప్రభుత్వానికి మిగులుతుంది. పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అదనంగా రూ.76 కోట్లు ఇస్తున్నాం. పేదరికం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కఋషి చేయాలని సిఎం వివరించారు. కొత్తగొల్లపాలెం టీడీపీకి కంచుకోట అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మళ్లీ అమరావతిని గాడిన పెట్టామని తెలిపారు. అక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. విశాఖ స్టీల్ కూడా గాడిలో పడిందన్నారు. విశాఖ ఉక్కుకు రూ.11 వేల కోట్లు నిధులు తెచ్చామన్నారు. విశాఖకు రైల్వే జోన్ కూడా వచ్చిందన్నారు. ఈనెలలోనే డీఎస్సీ పూర్తి చేసి జూన్‌లోగా టీచర్ల నియామకాలు చేపడతామన్నారు. ఉద్యోగులు ప్రజా సేవలో బాగా పని చేస్తున్నారని అన్నారు. తాను ఏం సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నానని విమర్శించే వాళ్ళు కళ్లు తెరిచి చూడాలని అన్నారు. 2027కి పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. 2029కి ఏపీలో జీరో పావర్టీ చూడాలనేది తన లక్ష్యమన్నారు. వారసత్వంగా అప్పు వచ్చిందని.. రూ.10 లక్షల కోట్లు అప్పు ఉందని వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తానన్నారు. తల్లికి వందనం మేలో ఇస్తామని ప్రకటించారు. ఎందరు పిల్లలు ఉంటే.. అంతమందికి తల్లికి వందనం ఇస్తామన్నారు. నాలుగు నెలలకు ఒకసారి ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. రైతుల పంటలకు గిట్టు-బాటు- ధర ఇస్తామని చెప్పారు. మే, జూన్‌లో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఇస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామని చెప్పారు. వ్యవసాయంలో మోడరైజేషన్ తీసుకువస్తామన్నారు. రాష్ట్ర ప్రజల కోసం డబ్బు సంపాదిస్తానని చెప్పారు. అంబేద్కర్ షెడ్యూల్ కులంలో పుట్టిన 12వ సంతానమని.. లండన్‌లో అంబేద్కర్ చదువుకోడానికి బరోడా రాజు సాయం చేశారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం రాసే స్థాయికి ఎదిగారన్నారు. అబ్దుల్ కలామ్‌కు అయ్యర్ అనే వ్యక్తి ఆపన్న హస్తం అందించారని చెప్పుకొచ్చారు. కలాం చరిత్రలో నిలిచిపోయారన్నారు. డ్వాక్రా సంఘాలకు పొదుపు నేర్పించారని.. ఇప్పుడు వారి వద్ద రూ.35 వేల కోట్లు పొదుపు డబ్బులు ఉన్నాయని తెలిపారు. సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిందన్నారు. గతంలో తాను సెల్‌ఫోన్ గురించి చెబితే అందరూ నవ్వారన్నారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇస్తామన్నారు. ఐదేళ్లలో ఇళ్లులేని అందరికీ ఇళ్లు కట్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక చాలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. రాజధాని అమరావతిని గాడిలో పెట్టాం. అక్కడ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రాజధాని అభివృద్ధి చెందితే ఆదాయం వస్తుంది. దాని ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు అవకాశం కలుగుతుంది.

## బీసీలకు పట్టం కట్టింది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ

నరేంద్ర మోదీ గారు ఆ హామీని నెరవేర్చకుండా కనీసం కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ కూడా ఏర్పాటు చేయని దుస్థితిలో ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన బిల్లును పార్లమెంటులో కూడా ఆమోదం తెలపాల్సిన బాధ్యత బీజేపీపై ఉందన్నారు. తెలంగాణలో ఉన్న అన్ని పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంఘాల నాయకులు బుధవారం దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరగనున్న మహా ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రైల్లో తెలంగాణకు చెందిన బీసీ నాయకులంతా వస్తున్నారని, అన్ని సంఘాలు బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. రిజర్వేషన్లు ఎవరిచ్చే బిక్ష కాదని, ఇది బీసీల హక్కు అని, పార్లమెంటు మీద ఒత్తిడి పెంచి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం పొందేలా పోరాడాలని అన్ని పార్టీల, సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, ఓబీసీ మేధావుల ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, ఎంబిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బడేసాబ్, బీసీ పొలిటికల్ జెఎసి యువజన విభాగం అధ్యక్షుడు చింతపల్లి సతీష్, నాయకులు వివి గౌడ్, అంజన్న యాదవ్, దేవర శివ, రాఘవేందర్, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టు నూతన అధ్యక్షుడు అనుమల జగన్ ను కలిసిన బొడ్డు బిక్షపతి గౌడ్ం



**వెలుతురు, హయత్ నగర్, ఏప్రిల్ 1:**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు అనుమల జగన్ ను తన ఛాంబర్ లో కలసి శుభాకాంక్షలు తెల్పిన హయత్నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు టీపీసీసీ లీగల్ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ బొడ్డు భిక్షపతి గౌడ్ తదితరులు, నూతన అధ్యక్షుడు జగన్ ను కలిసిన వారిలో హయత్ నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందుటి సంతోష్ కుమార్ గౌడ్, సహాయ కార్యదర్శి బండి నరేష్, గ్రంధాలయ కార్యదర్శి మేకల సతీష్, కార్యనిర్వాహక సభ్యుడు సింగపంగు రాజేష్ తదితరులు ఉన్నారు,ఈ సందర్భంగా బొడ్డు బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ హైకోర్టు అభివృద్ధి కి మరియు హైకోర్టు నూతన భవనం శంకుస్థాపన కు నూతన అధ్యక్షులు అనుమల జగన్ అహర్నిశలు కృషి చేస్తారని, యువకుడు మరియు ఉత్సవాహంతుడు అయినటువంటి నూతన అధ్యక్షుడు ముందు ముందు మరెన్నో పెద్ద పదవులను అధిరోహించాలని కోరుకుంటున్నామని తెలియచేయడం జరిగింది.

## నేటి జంతర్ మంతర్ ధర్నా లో పాల్గొననున్న కాంగ్రెస్ బృందం



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 1:**
ఢిల్లీ బయలుదేరిన వెళ్ళిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,మంత్రులు పొన్నం ప్రభాకర్ ,కొండా సురేఖ, బీసీ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య,వాకిటి శ్రీహరి ,మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రకాష్ గౌడ్, ఈర్లపల్లి శంకరయ్య లున్నారు, బుధ వారం బీసీ లకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసనసభలో చేసిన చట్టాన్ని పార్లమెంట్ లో ఆమోదించాలని ఢిల్లీలో బీసీ సంఘాల ధర్నాలో వారు పాల్గొనున్నారు, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీ సంఘాల మహా ధర్నా లో పాల్గొననున్న పీసీసీ చీఫ్, మంత్రులు , బీసీ ఎమ్మెల్యేల బృందం.మహాధర్నా అనంతరం కేంద్ర మంత్రులు,జాతీయ పార్టీ నేతలను కలిసి బీసీ రిజర్వేషన్ల పెంపు చట్టానికి మద్దతు తేలనున్న తెలంగాణ మంత్రుల బృందం కలువనున్నారు.

## లైంగిక దాడులకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు: మంత్రి సీతక్క



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 1:**
నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట మరియు హైదరాబాద్ లైంగిక దాడుల ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి సీతక్క రాష్ట్ర పోలీస్ అధికారులను కోరారు లైంగిక దాడి ఘటనలకు సంబంధించి నిందితులందరినీ అరెస్టు చేసి, బాధితులకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయం అందిస్తున్నాం. మత్తు పదార్థాల కట్టడి కోసం చర్యలు తీసుకుంటూ, గస్తీ పెంచాలని పోలీస్ శాఖను ఆదేశించాం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు.

# 1100 అంతర్జాతీయ పోటీదారులు సహా 85,000 దాటిన వేవ్స్ 'క్రియేట్ ఇన్ ఇండియా' పోటీ దరఖాస్తులు

### 2025, మే 1 నుంచి 4 వరకూ ముంబయి వేదికగా జరిగే వేవ్స్ 'క్రియేటోస్పియర్'లో 32 పోటీల్లో ఫైనలిస్టులుగా నిలిచిన 750 మంది భాగస్వామ్యం

**వెలుతురు 01 ఏప్రిల్ 2025 పిఐబీ ఢిల్లీ:**
ఈ ఏడాది మే 1 నుంచి 4 వరకు ముంబయి జియో వరల్డ్ సెంటర్ లో జరిగే ప్రపంచ దృశ్య-శ్రవణ, వినోదరంగ సదస్సు-వేవ్స్ లో భాగంగా ప్రారంభించిన క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ (సీఐసీ) తొలి సీజన్.. 1,100 అంతర్జాతీయ పోటీదారులు సహా, మొత్తం 85,000 దరఖాస్తుల ఘనత సాధించింది. 32 విలక్షణ విభాగాలకు చెందిన పోటీల్లో పాల్గొని, కఠినమైన వడపోతల అనంతరం ఫైనలిస్టులుగా నిలిచిన 750 మందికి వారి వ్యక్తిగత పోటీల ఫలితాన్ని, నైపుణ్యాన్ని పరిశ్రమ ప్రముఖుల ఎదుట ప్రదర్శించే అవకాశం దక్కుతుంది. పోటీలో పాల్గొంటున్నవారికి ఎంచుకున్న రంగంలో వ్యాపారవేత్తలతో నెట్వర్కింగ్ అవకాశాలు, పిచ్చింగ్ సెషన్లే కాక, మాస్టర్ క్లాసుల ద్వారా అంతర్జాతీయ నిపుణులనుంచి నేరుగా నేర్చుకునే అవకాశం, పానెల్ చర్చలు, సదస్సులు, సమావేశాల్లో పాల్గొనే అపురూపమైన అవకాశం దక్కుతుంది. క్రియేట్ ఇన్ ఇండియా పోటీల్లో విజేతలుగా నిలిచినవారిని ముంబయిలో జరిగే వేడుకలో 'వేవ్స్ క్రియేటర్ అవార్డ్స్' పురస్కారంతో సత్కరిస్తారు. సృజనాత్మక ప్రపంచంలో భారీ పాదం మోపిన ఈ పోటీలు కొత్త ఆలోచనలకి వేదికగా నిలుస్తూ దేశ, విదేశాల పోటీదార్ల భాగస్వామ్యాన్ని చవి చూస్తున్నాయి, అంతర్జాతీయ స్థాయిలో సృజనాత్మకతకి కొత్త చిరునామాగా ఆవిర్భవిస్తున్నాయి.




ఉత్సాహభరితమైన రీల్ మేకింగ్ పోటీ, పరిష్కారానికి ప్రాముఖ్యాన్నిచ్చే ట్రూత్ టెల్ హ్యాకథాన్, నూతన ధోరణులకు పెద్దపీట వేసే యంగ్ ఫిలిం మేకర్స్ పోటీ, ఊహాత్మక శక్తికి జేజేలు పలికే కామిక్స్ క్రియేటర్ ఛాంపియన్షిప్ వంటి 32 విలక్షణమైన పోటీలు కలిగిన సీఐసీ, సృజనకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశాన్ని కల్పిస్తోంది. ఏఐ అవతార్ క్రియేటర్ ఛాలెంజ్, వామ్! యానిమే పోటీ, ఈ-స్పోర్ట్స్ టోర్నమెంట్, ట్రైలర్ తయారీ పోటీ, థీమ్ మ్యూజిక్ పోటీ, ఎక్స్ ఆర్ క్రియేటర్ హ్యాకథాన్ వంటి అత్యున్నత సాంకేతిక పోటీ సహా కొత్త తరం కథకులు, డిజైనర్లు, డిజిటల్ ఆవిష్కర్తల కెరీర్లకు ఊపందించే వేదికగా సీఐసీ సత్తా చాటుతోంది.
విభిన్న విభాగాలు, తరాలు, దేశాల ఎల్లలు చెరిపేస్తూ పోటీదార్లను ఏకం చేస్తూ, భారతదేశ సృజనాత్మకతని వేడుక చేసుకునే సీఐసీ కార్యక్రమం, కథన రీతుల్లో, డిజిటల్ వ్యక్తీకరణలో నూతన పోకడలను స్వాగతిస్తూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. తొలి సీజన్ పునాది బలంతో భవిష్యత్తు సీజన్లలో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకుని, సృజనకారులకు సాధికారతను కల్పించే వేదికగా, సాంస్కృతిక రంగానికి దిక్సూచిగా నిలువగలదని చెప్పవచ్చు.

**వేవ్స్ గురించి:**
మీడియా, వినోద రంగాల్లో మైలురాయి వంటి తొలి వేవ్స్ సదస్సు (ప్రపంచ ఆడియో విజువల్, ఎంటర్టైన్మెంట్ సమిట్) ను భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ ఏడాది మే 1 నుంచి 4 వ తేదీ వరకూ ముంబయిలో నిర్వహిస్తారు.
మీరు పరిశ్రమలో సేవలందిస్తున్న నిపుణులైనా, సృజనకారులైనా, ఆవిష్కర్తలయినా, మీకు ప్రపంచ స్థాయి మీడియా, వినోద రంగాల్లో పని చేస్తున్న ఇతరులతో కలిసి పని చేసేందుకు, అనుసంధానమై మరింత తోడ్పాటును అందించేందుకు సదస్సు అవకాశాలను కల్పిస్తుంది.
కంటెంట్ సృష్టి, మేధోపరమైన హక్కులు, సాంకేతిక సృజనలో అగ్రగామి దేశంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేసేందుకు వేవ్స్ సదస్సు దోహదపడుతుంది. ప్రసార విభాగాలు, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, సినిమాలు, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, శబ్ద గ్రహణ-సంగీత రంగాలు, అడ్వర్టైజింగ్, డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలు, జెనరేటివ్ ఏఐ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఎక్స్టెండెడ్ రియాలిటీ తదితర రంగాల్లోని పరిశ్రమలపై సదస్సు దృష్టి కేంద్రీకరిస్తుంది.
మీ సందేహాలు, ప్రశ్నలకు జవాబులు ఇక్కడ
పీఐబీ టీం వేవ్స్ తాజా ప్రకటనల ద్వారా అప్ డేటెడ్ గా నిలవండి
వేవ్స్ సదస్సులో పాల్గొనేందుకు ఇప్పుడే మీ పేర్లను నమోదు చేసుకోండి!

# కరీంనగర్ అంబేద్కర్ స్టేడియానికి నిధులివ్వండి

### సింథటిక్ ట్రాక్ లను ఏర్పాటు చేయండి
### ఓపెన్ గ్యాలరీలకు రక్షణ ఏర్పాట్లు కల్పించండి
### కేంద్ర మంత్రి మన్సూక్ మాండవీయకు బండి సంజయ్ విజప్తి
### మాజీ మేయర్ సునీల్ రావు, శాతవాహన వర్సిటీ వీసీతో కలిసి కేంద్ర మంత్రిని కలిసి సంజయ్

**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 01:**
ఖేలో ఇండియా పథకంలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర కార్మిక, ఉపాధి, క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి మన్సూక్ మాండవీయను కోరారు. మంగళవారం రోజున ఉదయం ఇదే అంశంపై ఢిల్లీకి విచ్చేసిన కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ లతో కలిసి బండి సంజయ్ కేంద్ర మంత్రి మాండవీయను కలిసి వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ "తెలంగాణలోని అత్యంత పెద్ద నగరాలలో ఒకటైన కరీంనగర్ విద్య, క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. అందులో భాగంగా కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, వైద్య కళాశాలలతోపాటు ఇతర విద్యాసంస్థలున్నాయి. ముఖ్యంగా క్రీడల్లో కరీంనగర్ ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. అర్జున అవార్డు గ్రహీత మదాసు శ్రీనివాసరావు కరీంనగర్‌కు చెందినవారే. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖేలో ఇండియా లేదా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాల ద్వారా కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలి."అని కోరారు.
ఈ సందర్భంగా సునీల్ రావుతో కలిసి అంబేద్కర్ స్టేడియంలోని క్రీడా సదుపాయాలను వివరించారు. "1986లో 22.20 ఎకరాల భూమి బహుళ ప్రయోజన ఈ క్రీడా స్టేడియం కోసం కేటాయించారు. 1998-2000 మధ్య ఎంపీ లాడ్స్, సింగరేణి కాలరీస్, ఎన్టీపీసీ, ఇతర ప్రైవేట్ సంస్థల సహకారంతో లెవెలింగ్, గ్యాలరీలు, 8-లేన్ 400 మీటర్ల అథ్లెటిక్స్ ట్రాక్ వంటి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. అయితే రోజురోజుకూ అథ్లెట్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత మట్టి ట్రాక్ కారణంగా అనేక మంది గాయాల బారిన పడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.
దీనిని దృష్టిలో ఉంచుకుని అంబేద్కర్ స్టేడియం అభివృద్ధిలో భాగంగా " 8-లేన్ సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ వల్ల మట్టి ట్రాక్ స్థానంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయండి. అట్లాగే అథ్లెట్లు రాత్రి వేళల్లో కూడా సాధన చేసేందుకు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేయాలి. దీంతోపాటు పోటీలు జరుగుతున్నప్పుడు ప్రస్తుత ఓపెన్ గ్యాలరీ(10)ల్లో క్రీడాకారులు, ప్రేక్షకులకు రక్షణ లేకుండా ఇబ్బంది కలిగిస్తున్నందున గ్యాలరీలపై తగిన (కెనోపీ) ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలి."అని కోరారు. తద్వారా కరీంనగర్ అథ్లెట్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ చేసి



దేశానికి గౌరవం తీసుకురావడానికి అనేక అవకాశాలున్నాయని పేర్కొన్నారు.




# సంపాదకీయం..

## సంక్షేమం పేరుతో.. దివాళా తీయిస్తే ఎలా !

సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు అమలు చేయమని చెప్పిందెవరు..ఉచిత బియ్యాలు, ఉచిత పందేరాలు... 58 ఏళ్లకే పెన్షన్లు...రాజకీయ నాయకులకు జీతభత్యాలు..ఇవన్నీ ఎవరి కోసం..ప్రజలు కట్టిన పన్నులతో పాటన చేయాల్సిన నేతలు రాష్ట్రాలను దివాళా తీయించేస్తున్నారు. అభివృద్ధి అంటే పెన్షన్లు పంచడం, సన్నబియ్యం పంచడం ఇదేనా..ఇవన్నీ నిలదీయడానికి ప్రజలంతా సిద్దం కావాలి. ఎపి కావచ్చు.. తెలంగాణ కావచ్చు....ధరల గురించి మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడరు. వారి సెక్యూరిటీ, ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడం...ప్రజల డబ్బుతో సోకులు చేసుకోవడం ఇదా పాలన అంటే..అన్నది ప్రజలంతా ఆలోచించాలి. జగన్ తన హయాంలో రాజధాని, పోలవరం నిర్మాణాలను పక్కన పెట్టారు. విశాఖ భీమిలి దగ్గర మాత్రం అద్భుత సౌధాలను నిర్మించుకున్నారు. దీనికి నాటి పాలకులు నేటికీ సమర్థించు కుంటున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉండదు. ఇలాంటి పాలకులు అవసరమా అని ఆలోచన చేయాలి. రాష్ట్రాలను అప్పుల్లో కూరుకు పోయేలా చేసి...దివాళా తీయించిన నేతలు నీతి వాక్యాలు పలుకుతున్నారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయరు. మిర్చి పండితే కొనుగోలు చేయలేరు. విద్యుత్, వైద్యం, విద్యారంగాలను పటిష్టంత చేయరు. ఇవన్నీ మరచి పందేరాలు చేస్తున్న ...వీరా మన పాలకులు ..అయినందుకు సిగ్గు పడాలి. ఇక తాజాగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని నిస్సిగ్గుగా అమ్మాలనుకోవడం రేవంత్ ప్రభుత్వ దివాళాకోరు విధానం కాక మరోటి కాదు. పెన్షన్లు, ఉచిత బస్సు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఎవరు అడిగారు. ఇవ్వడానికి డబ్బులు ఉన్నాయో లేదో ఆలోచించకుండా ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు భూములు, ఆస్తులు తెగనమ్మితే ఎలా. నీతులు పలుకుతున్న గత బిఆర్ఎస్ పాలకులు కూడా ఇంతకన్నా భిన్నంగా చేయలేదు. వారి హయాంలోనూ భూములు అమ్ముకున్నారు. పేదలు ఇళ్లు కొనగలిగేలా పరిస్థితులు ఉంటే మూసీ మురికిలో ఎందుకు నివసిస్తారు. మూసీ సుందరీకరణ పేరుతో వారిని నిర్వాసితులను చేయడం ఎంతవరకు సమంజసం. మూసీ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సబబు. లగచర్లలో ఫార్మా పేరుతో దాడులు జరిగాయి. అభివృద్ధి పేరుతో గిరిజన తండాలపైకి వెళ్లారు. పాలకులు పక్కా రియల్ ఏజెంట్లలాగా మారితే ఇక రక్షించేదెవరన్నది గుర్తించాలి. చెప్పిన పథకాల అమలుకు, ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ నాయకులు హెచ్‌సియూ భూములను అమ్ముకుంటామంటే ఎలా! హెచ్‌సియూ భూములు అమ్మకాన్ని ఎవ్వరైనా తీవ్రంగా తప్పు పట్టాల్సిందే. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ పరిసర ప్రాంతాలే కాస్త ఆక్సిజన్ ఇచ్చే ప్రాంతాలుగా ఉన్నాయి. వీటిని కూడా లేకుండా చేస్తామనే దుర్మార్గపు ఆలోచన సరికాదు. 400 ఎకరాలు అమ్మి.. రూ.30వేల కోట్లు రాబట్టుకోవాలని అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలి. చ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవడం ద్వారా విలువైన భూములను కాపాడాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం తగదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశంలో పేరు ప్రఖ్యాతలు సాధించుకుంది. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్పగా రాణిస్తున్నారు. దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉంది. హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం భూముల వేలం తగదని ప్రభుత్వం పెద్దలు గుర్తించాలి. భూములు ప్రభుత్వానివే అని చెబుతున్న సిఎం, మంత్రులు వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలి. యూనివర్సిటీ భూములపైన రాజకీయం చేస్తున్న తీరు మంచిది కాదు. బుల్డోజర్లను పెట్టి అక్కడున్న చెట్లను తొలగించి చదును చయడం సరికాదు. హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే. ఇప్పటికే కొండలు, గుట్టలను మాయం చేస్తున్నారు. హైదరాబాద్లో ఇప్పటికే కొండలు గుట్టలు మాయం అయ్యాయి. ఎక్కడపడితే అక్కడ ఇవి ధ్వంసం చేయడం సరికాదు. వీటిని కూడా ఆపాలి. ఇలాచేస్తూ పోతే భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. పర్యావరణ నష్టం ప్రభావంపై అధ్యయనం చేయాలి. ఇప్పటికే హైదరాబాద్‌లో వేల ఎకరాలు మాయం అయ్యాయి. పర్యావరణ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని రేవంత్ ప్రభుత్వానికి రాజకీయపార్టీలు కూడా సూచించాయి. పచ్చదనం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడం సరికాదని పాలకులు గుర్తించాలి. నిధుల సమీకరణ కోసం ఈ తరహా చర్యలు చేపట్టడం కూడా మంచిది కాదు. ముందుగా ఉచిత పథకాలను సమీక్షించాలి. నష్టాలను తెచ్చే పథకాల్లో కోతలు విధించుకోవాలి. అప్పులకు,భేషజాలకు పోకుండా ఉన్న ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడపాలి. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోంచి బయటపడేయాలంటే అమ్మకాలు.. కాదు ఆస్తులు సృష్టించాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయం భూముల అమ్మకం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి. విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం సరికాదు. ఇప్పటికే హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతోంది. హైదరాబాద్ లో కబ్జాలను గుర్తించి ముందుగా వాటిని విముక్తం చేయాలి. చెరువులు కబ్జాలను గుర్తించాలి. అందుకు హైడ్రా చేస్తున్న కృషిని మరింతగా ప్రోత్సహించాలి. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల కబ్జాలను గుర్తించి, ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి. డబ్బులను వృధా చేసే ఓట్ల పథకాలకు పాతరేసినప్పుడే రాష్ట్రం అప్పుల ఊబినుంచి బయటపడగలదు. ఇది చంద్రబాబుకైనా మరెవ్వరికైనా వర్తిస్తుంది. సంక్షేమం పేరుతో అప్పులు చేసి, పందేరాలు చేయడం ఎంతమాత్రం కాదు. ఫ్రీ పథకాలను ఇకనైనా సమీక్షించడం క్షేమకరం.



## నేటినుంచి మధురైలో సిపిఎం మహాసభలు

- వేలాదిగా తరలి వెళ్లిన ఎర్రదండు సభ్యులు

**చెన్నై, ఏప్రిల్1( వెలుతురు):**

సిపిఎం 24వ అఖిల భారత మహాసభ బుధవారం తమిళనాడులోని మధురైలో ప్రారంభం కానుంది. అంతకుముందే తమిళనాడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరిని అమరవీరుల స్మారక జాతాలు మంగళవారం మదురైకు చేరుకున్నాయి. అందులో భాగంగానే జాతాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కామ్రేడ్ సింగరవేలర్ స్మారక జాతా చెన్నై నుండి మదురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగుతోంది. సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె బాలభారతి జాతాకు నాయకత్వం వహిస్తున్నారు. దీనిలో వందలాది మంది కామ్రేడ్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ జాతా ప్రారంభం సందర్భంగా చెన్నై శివార్లలోని తాంబరంలో బహిరంగ సభ జరిగింది. విద్యార్థి అమరవీరులు సోము, సెంబు త్యాగాలను గౌరవించే జాతా తూత్తుకుడి నుండి మధురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పి సంపత్ ఈ జాతాకు నాయకత్వం వహించారు. విద్యార్థి సంఘం నేతలు, పార్టీ నాయకుల సమక్షంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కెజి భాస్కరన్‌కు జ్యోతిని అందజేశారు. సేలం జైలు అమరవీరుల స్మారక జాతా సేలం సెంట్రల్ జైలు నుండి ప్రారంభమైంది. 1946లో ఉరితీయబడిన నలుగురు యువ వస్త్ర మిల్లు కార్మికుల జ్ఞాపకార్థం కోయంబత్తూరులోని చిన్నియం పలయం అమరవీరుల జాతా మదురైలోని పార్టీ మహాసభ వేదిక వరకు కొనసాగింది. మాజీ ఎంపి పిఆర్ నటరాజన్ జ్యోతిని అందజేసిన కార్యక్రమంలో వందలాది మంది కామ్రేడ్స్ పాల్గొన్నారు. కోయంబత్తూరు జిల్లా కమిటీ కార్యదర్శి సి పద్మనాభన్, ఇతర నాయకులు హాజరయ్యారు. తిరువయారు యూనియన్ కందియూర్‌లోని వెన్మణి అమరవీరుల స్మారక జాతాకు యూనియన్ కార్యదర్శి ఎ రాజు నాయకత్వం వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చిన్నైతో పాటు పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

- హనుమంత వాహనంపై విహరించిన స్వామివారు

**తిరుపతి,ఏప్రిల్1( వెలుతురు):**



తిరుపతి శ్రీ కోదండ రామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం ఉదయం 8 గంటలకు స్వామివారు హనుమంత వాహనంపై అభయమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్భక్తులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధిగాంచిన వాడు హనుంతుడు. రాముడు భక్తాగ్రగణ్యుడైన హనుమకు ఆత్మతత్వాన్ని బోధించినట్లు- ప్రాచీన వాఙ్మయం నుండి తెలుస్తోంది. హనుమంతుడు తనను సేవించే భక్తులకు ఆత్మోన్నతిని ప్రసాదిస్తున్నాడు. శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో హనుమద్వాహన సేవను సిరియ తిరువడిగా కీర్తిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, కొబ్బరినీళ్లు, చందనంలతో అభిషేకం చేశారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సీసీకెమెరాలతో నేరాల గుట్టురట్టు

## కాలనీల్లో ఏర్పాటుకు ప్రోత్సాహం

**హైదరాబాద్, ఏప్రిల్1( వెలుతురు):**

శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కడిక్కడ ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సంఘాలను పిలిచి మాట్లాడుతున్నారు. ఓ మోస్తరు పట్టణంలో ఇప్పుడు వీటి ఏర్పాటు సాగుతోంది. ఇటీవల అనేక నేరాల చిట్టాలను గుర్తించడంలో సిసి కెమెరాలు బాగు ఉపయోగ పడ్డాయి. అనేక క్రిమినల్ కేసులు సిసి కెమరాల దృశ్యాల ఆధారంగా ఛేదించారు. అందుకే జిల్లాల కేంద్రాలతో పాటు చోటమోటా పట్టణాల్లో కూడా వీటి ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులను ఇతరలను పిలిచి మాట్లాడుతున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని,



దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయి. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ విశేషంగా కృషి చేస్తున్నది. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్‌కు మంచి గుర్తింపు కూడా వచ్చింది. దానిని కాపాడుకుంటూ మరింత పేరుపొందేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

**నిజామాబాద్, ఏప్రిల్1( వెలుతురు):**

రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి.అన్ని జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి, 4 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఏడాది పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు చేరుకొనే అవకాశం ఉంటుందని తెలిపింది. ఎండవేడిమికి మధ్యాహ్నం ఇండ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జనాలు జంకుతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఎండ చురుకుమంటోంది. 11 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లే పరిస్థితిలేదు. మధ్యాహ్నం మూడు గంటలవరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇంట్లో ఉన్నా తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పగటి ఉష్ణోగ్రత పదిరోజులు గా 39నుంచి 40డిగ్రీలమధ్య నమోదుకావడంతో నిప్పుల కొలిమిగా మారింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానియాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో శీతలపానియాల విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఆదిలాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన రంజన్లను విక్రయిస్తుండడంతో ప్రజలు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కూలర్లకు గిరాకీ పెరిగింది. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పగటిపూట అవసరమైతే తప్ప బయట తిరగొద్దు. శారీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దు. డీహైడ్రేషన్‌కు గురవకుండా మంచినీటిని అధికంగా తీసుకోవాలన్నారు. కాటన్ దుస్తులనే ధరించాలి. ఎండలో ప్రయాణించాల్సి వస్తే ముఖానికి రుమాలు కట్టుకోవాలి, టోపీలు, చలువ అద్దాలు, గొడుగు, హెల్మెట్ ధరించాలి. పంచదార, మజ్జిగ, నిమ్మరసం, ఉప్పుకలిపిన నీటిని తరుచూ తాగాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

( ఆధ్యాత్మికం )

## జీవకోటిని కాపాడుకోవాలి !

**తిరుమల, ఏప్రిల్1( వెలుతురు):**

మనిషజతో పాటు కోటానుకోట్ల జీవరాశి ఈభూమ్మీద నివసిస్తోంది. ఇది ప్రకృతి ధర్మం. మనతో పాటు ఇవ మనుగడ సాగిస్తేనే మనకు కూడా జీవిక సాధ్యం. ఈ ప్రపంచంలో అనంత ప్రాణకోటి ఉంది. మనిషి తను బతుకుతూ.. తనపరిసరాలను బతికించుకోవాలి. తోటి జీవకోటిని కాపాడుకోవాలి. లేకుంటే మనమనుగడ కూడా ప్రశ్నార్థకం కాగలదు. జీవకోటిలో తెలివితేటలున్న మనిషి మాత్రం అనుకున్నదే తడవుగా ఫలితం వెంటనే కనబడాలని చూస్తాడు.పశు పక్ష్యాదులు, ఎడారుల్లో సంచరించే జీవులు, ఉభయచరాలు ఎంతో ఓర్పు, సహనంతో కాలం వెళ్ళ బుచ్చుతాయి. ముమ్ముందు కాలం అనుకూలంగా ఉంటుందన్న ఆశతో ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకొని జీవిస్తాయి. ఒక పేదవాడు తన ఇంటిముందు ఓ మొక్క నాటాడు. కొన్ని రోజులకు అది పెరిగి పెద్దదయింది. అది పండ్లు ఇచ్చి ఆకలి తీర్చుతుందని ఆశపడ్డాడు. చాలా రోజులు ఎదురు చూశాడు. కాని, అలా జరగలేదు. తగినంత ఆహారం అందక శరీరంతోపాటు మనసూ బలహీనపడింది. ఫలితంగా, అతడి నిరీక్షణ- కాలాన్ని మరింత పొడిగించిన భావన కలగజేసింది. విసుగు తెప్పించింది. కోరిక నెరవేరలేదని అతడిలో కోపాగ్ని రగిలింది. విచక్షణా జ్ఞానం కోల్పోయాడు. పూత, కాత రెండూ లేని చెట్టు ఎందుకని దాన్ని నరికివేశాడు. మరుసటి రోజు తెల్లవారి లేచి చూస్తే పడిపోయిన చెట్టుకు ఒక పువ్వు పూసి ఉంది. ఆ సన్నివేశం చూశాక అతడిలో దుఃఖం పొంగు కొచ్చింది. ఆ చెట్టును పట్టుకుని విలపించాడు. తొందరపడ్డానని బాధపడ్డాడు. జీవితం ఇలాగే అనూహ్య తీర్పునిస్తుంది. కారణం, అది నిత్యనూతనం. అందువల్లే 'ఫలితం పని చేసేవాడి చేతిలో లేదు. అది కాలపురుషుడి నిర్ణయం' అని గీత చెబుతుంది. కాలనికి అనుగుణంగా మనం కూడా ముందుకు సాగాలి. అప్పుడే ఫలితం వస్తుంది.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం...

● కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు...



**కూకట్ పల్లి ఏప్రిల్ 1 వెలుతురు:**
వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందయమని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని సుమిత్రనగర్ జాతీయ రహదారి పై చైతన్య నగర్ వినాయక యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో చేపట్టినా చలివేంద్రం కార్యక్రమాన్ని మంగళవారం వారు సందర్శించి అక్కడికి వచ్చిన బాటసారులకు మజ్జిగ, త్రాగు నీరును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చైతన్య నగర్ వినాయక యూత్ అసోసియేషన్ వారు మజ్జిగ, తాగునీరు కార్యక్రమం ప్రతి వేసవి కాలంలో నిరంతరం ఏర్పాటు చేస్తూ ఏడవ సారి పెట్టడం జరిగిందనీ జాతీయ రహదారి పైన పోయే బాటసారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన చైతన్య నగర్ ప్రజలకు, వినాయక యూత్ అసోసియేషన్ వారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి కాలనీలో మెయిన్ సెంటర్లలో పెట్టడానికి ముందుకు రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కర్ రావు, చైతన్య నగర్ కమిటీ మెంబర్స్ సుమిత్ర నగర్ వాసులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి ముందుచూపు ఉన్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

● ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం.యుగంధర్ రెడ్డి..



**కూకట్ పల్లి ఏప్రిల్ 1 వెలుతురు:**
ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల మన్ననలు పొందుతూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ. బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయినగర్ లోని ఒక రేషన్ షాపులో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు సన్న బియ్యంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. పేద ప్రజలు మార్కెట్లో సన్న బియ్యాన్ని కొనలేని పరిస్థితిని గమనించిన ప్రభుత్వం మహత్తరమైన ఆలోచన చేసి పేదలు కూడా సన్న బియ్యం ఎందుకు తినకూడదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముందుచూపు ఆలోచన రావడం ఎంతో అద్భుతమైన కార్యక్రమమని అన్నారు. ఏప్రిల్ 1వ తేదీ పేదలకు ఒక పండగ లాంటి రోజు అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన యుగంధర్ రెడ్డికి రేషన్ షాపు యజమాని వెంకటస్వామి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్, కాంగ్రెస్ పార్టీ దళిత నేత జెల్లా శివ, చింటు, మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం...

● కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..



**కూకట్ పల్లి ఏప్రిల్ 1 వెలుతురు:**
తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుందని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఉగాది కానుకగా సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించిన పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకంలో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్, మొగులమ్మ కాలనీలోని ఛౌక ధరల దుకాణాలలో అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం పరిశీలించి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం అందుతుందని అన్నారు. రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున సన్నబియ్యం ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. రేషన్ కార్డ్ లో ఎంతమంది ఉంటే అంతమందికి ఆరు కేజీల చొప్పున సన్న బియ్యం పొందవచ్చునని తెలిపారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, సిహెచ్.భాస్కర్, యాదగిరి, బాలస్వామి, మహేష్, ఫారూఖ్, ఖలీమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం

**వెలుతురు న్యూస్ చౌటుప్పల్ ఏప్రిల్ 1:**



మున్సిపల్ పరిధి లక్కారం 7 వ వార్డులో మంగళవారం రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించడమైనది ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ ఇచ్చే కార్యక్రమం ఉగాది పండుగ రోజు నుండి ప్రారంభించారు ఈ అవకాశం నిరుపేదలకు వరం లాంటిది ధనవంతులకు కాకుండా పేదలకు కూడా సన్నబియ్యం తినాలని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ చౌటుప్పల మండల పరిధిలో ఉన్న తెలుపు రేషన్ కార్డు దారులు 19.171 ఉన్నాయి వీరందరికీ సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా మంగళవారం నుండి అందజేయడం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో హరికృష్ణ, మునుగోడు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కాసర్ల మంజుల, కొయ్యడ సైదులు గౌడ్, బాబా షరీఫ్, చెన్నగోని అంజయ్య గౌడ్, పాశం సంజయ్ బాబు, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, బొంగు జంగయ్య గౌడ్, సంద గల్ల సతీష్, భద్రయ్య, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, బక్క శ్రీనాథ్, కుక్కల నరసింహ, రేషన్ డీలర్ గుమ్మడి రాజశేఖర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ బిఆర్ఎస్, బీజేపీ కుట్రలు...

● టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

**కూకట్ పల్లి ఏప్రిల్ 1 వెలుతురు:**




విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ బిఆర్ఎస్, బీజేపీ కుట్రలు పన్నుతున్నాయని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వివాదాలు నెలకున్న భూములను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హెచ్ సియూ స్వాధీనం చేసిందని, దానికి బదులుగా వర్సిటీకి 397 ఎకరాలను బదలాయించిందని స్పష్టం చేసిందన్నారు. దీని పై అప్పటి రిజిస్టర్ సంతకం చేసారని తెలిపారు. కంచ గచ్చిబౌలిలో వేలానికి ప్రతిపాదించిన 400 ఎకరాల్లో ఒక్క అంగుళం భూమి కూడా హైద్రాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం (హెచ్ సియూ) భూమి లేదని, ఆ భూమిపై యాజమాన్య హక్కు తనదేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, సుప్రీంలో కేసు గెలిచి రేవంత్ సర్కారు ఇది తెలంగాణ సంపద అని ఆర్డర్ తేగానే ఆర్తనాదాలు, ఆహాకారాలు మొదలయ్యాయి. కొంత మంది రాజకీయ నాయకులు వారి స్వప్రయోజనాల కోసం, స్థిరాస్తి వ్యాపారాల ప్రయోజనాల కోసం విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజా అవసరాల కోసం కేటాయిస్తామంటే ఓర్చుకోలేకపోతున్నారు. కేటీర్ కి అస్సలు భూముల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ధరణి పేరుతో దొంగ పత్రాలు సృష్టించి, లక్షల ఎకరాల భూములు ఆక్రమించుకొని అమ్ముకున్నారు. 19ఏళ్లుగా భూములు వివాదంలో ఉన్నందున చెట్లు పెరిగాయి, అటవీ భూములంటూ తప్పుదారి పట్టిస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. విద్యార్థులను రెచ్చగొడుతున్నారు, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు కూడా గమనించాలని మీరు యూనివర్సిటీలో చదువుకోవాలి మనకు కష్టం వచ్చినపుడు, మనకు సౌకర్యాలు లేనప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయాలని మేమంతా కూడా విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చాము అని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో 10 సంవత్సరాల ఆర్థిక విధ్వంశాన్ని చక్కదిద్దుతూ విజ్ఞతతో ముందడుగు వేస్తుంది అన్నారు.

## సన్న బియ్యం పంపిణీ పేదలకు వరం'...

● జిట్టా సునీల్ కుమార్ యాదవ్...

**కూకట్ పల్లి ఏప్రిల్ 1 వెలుతురు:**



రాష్ట్రంలో నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం పేదలకు వరం లాంటిదని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు జవహర్ బాల్ మంచ్ స్టేట్ కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూకట్పల్లి నియోజకవర్గంలో బాలాజీనగర్ డివిజన్ లోని పలు రేషన్ దుకాణంలో తెల్లరేషన్ కార్డుదారుల కు సన్న బియ్యం పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిట్టా సుశీల్ కుమార్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకులు రాహుల్ సింగ్ చౌహాన్, బాలాజీ నగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు అల్లావుద్దీన్, జాహిర్ యువజన కాంగ్రెస్ నాయకులు విశాల్,నంద కిషోర్, రాజు, కార్తీక్, ప్రేమ్, సంతోష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీకి చేరిన గచ్చిబౌలి భూముల వ్యవహారం...

ఆ భూముల విక్రయాన్ని ఆపేందుకు రంగంలోకి బీజేపీ రాష్ట్ర నాయకత్వం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కంచె గచ్చిబౌలి భూములపై కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను కలిసిన కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణ బీజేపీ ఎంపీలు

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ను కలిసిన ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, నగేశ్

కంచె గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రిని కోరిన తెలంగాణ బీజేపీ ఎంపీలు

పర్యావరణ, హెరిటేజ్ భూములను రక్షించాలని కోరిన ఎంపీలు

హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు కంచె గచ్చిబౌలి భూములు ఎంతో ప్రయోజనకరం

700 రకాల ఔషధ మొక్కలు, 220 రకాల పక్షులతో ఆ ప్రాంతమంతా అలరారుతోంది

ఈ భూములను రియల్ ఎస్టేట్ గా మార్చి వేల కోట్లు దండుకోవాలని చూస్తున్నారు

హెచ్ సీయూ విద్యార్థులతోపాటు యావత్ హైదరాబాద్ ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు

తక్షణమే గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరిన బీజేపీ ఎంపీలు

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 01:

## ప్రతి నిరుపేద కుటుంబం సన్న బియ్యంతో కడుపు నిండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష

● టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

**కూకట్ పల్లి ఏప్రిల్ 1 వెలుతురు:**



రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబ కడుపు నింపాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణి చేస్తుందనీ టిపిసిసి అధికార ప్రతినిధీ డాక్టర్ సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ తెలంగాణ ప్రభుత్వం ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకం కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో బాలాజీనగర్, అల్లాపూర్ డివిజన్ లలో డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, ఎండి మొయినుద్దీన్ ఆధ్వర్యంలో పలు రేషన్ షాప్ లలో తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలకు సన్న బియ్యం పథకం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పేదలు కూడా సంపన్ను లతో సమానంగా సన్న బియ్యం తినే విధంగా సన్న బియ్యంను అందించాలనే గొప్ప ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి చేసి ఉగాది పర్వదినాన పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు. సన్న బియ్యం అంటే కేవలం ధనవంతుల తినే ఆహారం గా వుండే, పేదవాడికి అందని ద్రాక్షగా ఉన్న సన్నబియ్యం. అన్నం అంటే పేదలు కేవలం పండుగల సమయంలో తినే రోజులు పోయాయి, నేడు ప్రతి గృహంలో సన్నబియ్యం ఇది పేదల పక్షం, సంక్షేమ ప్రభుత్వ విజయం అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియమ్మ, రాహుల్ గాంధీ ఆలోచనలతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో సువర్ణ పాలనను సీఎం రేవంత్ రెడ్డి అందిస్తున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినప్పటికీ, గడిచిన 10 ఏళ్లలో విధ్వంసం సృష్టించినప్పటికీ అన్నింటీని అదిగమించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. మంచి పని చేస్తే మమ్మల్ని అభినందించాల్సింది పోయి, బీజేపీ కోడి గుడ్డు మీద ఈకలు పీకే రాజకీయం మొదలుపెట్టింది అన్నారు. పండుగ రోజు కూడా పచ్చి అబద్దాలతో బీజేపీ కి చెందిన కేంద్రమంత్రి ఒక్కరు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించారు. రేషన్ షాపులో మోదీ ఫోటో పెట్టాలని అయన వితండవాదం చేస్తున్నారు. బీజేపీ భాగస్వామిగా ఉన్న పక్క రాష్ట్రంలో కేవలం ముఖ్య మంత్రి ఫోటో ఉంది కానీ ప్రధాన మంత్రి మోదీ లేదనే విషయం తెలియనిది కాదు, మరి తెలంగాణాలో మోదీ ఫోటో ఎందుకు పెట్టాలో వారే చెప్పాలనీ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పథకాల ద్వారా ప్రజలకు చేరువ అయితే తమ పార్టీని ప్రజలు దూరంగా పెడతారని బీజేపీ వారు భావించడం వల్లనే ఇలాంటి అర్థం పర్థం లేని డిమాండ్లతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణాలో ఉన్న ప్రతి పేద ఇంటికి నెల నెలా సన్న బియ్యం అందించే యజ్ఞానికి సబ్బండ వర్గాలు సహకరిస్తాయని, ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలను ప్రజలే తిప్పికొడతారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, డివిజన్ ల మహిళా అధ్యక్షురాళ్లు మారుతీ, భారతమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెపు నాగరాజు, సాధు ప్రతాప్ రెడ్డి, రంగారావు, సుంకన్న, మస్తాన్ రెడ్డి, జమీర్ సాహెబ్, సీనియర్ మహిళా నాయకురాళ్లు స్వరూప, బండి సుధ, అబ్దుల్లా, రవి ముదిరాజ్, గిరిధర్, సురేందర్, నందు సతీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం.....

● కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి

**కూకట్ పల్లి ఏప్రిల్ 1 వెలుతురు:**



తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుందని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యాన్ని సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా పౌష్టిక విలువలు కలిగిన సన్న బియ్యం పంపిణీని కార్యక్రమాన్ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి సూచన మేరకు నియోజకవర్గంలోని కెపిహెచ్బి కాలనీ డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శేరి సతీష్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మంగళవారం రేషన్ దుకాణం ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వని ఆనాటి (టిఆర్ఎస్ నిన్నటి బి ఆర్ ఎస్, రేపటి విఆర్ఎస్ పార్టీ) అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే కరీబి హటావో అనే బాటలో నడుస్తుందన్నారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రోటి కపడ ఔర్ మకాన్ అనే నినాదం మీద కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేదల పట్ల వెన్నుదన్నుగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండారగల్ల సంజీవ రావు, ఫణీంద్ర కుమార్, బి. బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, రేష్మ, యమునా, దేవ సహాయం రవి, కొమ్ము బాబు, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ లో సన్న బియ్యం పథకం ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**వెలుతురు, ఎల్ బి నగర్, ఏప్రిల్ 1:**
ఎల్ బి నగర్ నియోజక వర్గం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డబుల్ బెడ్రూమ్ సమీపంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకాన్ని మంగళ వారం నాడు ఎల్.బి.నగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, సీనియర్ నాయకులు జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులు ఏ ఎస్ ఓ పుల్లయ్య, డీటీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభోత్సవం

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఏప్రిల్ 01:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని రేషన్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికి నెలకు 6 కేజీల చొప్పున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేయడం నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని నల్గొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజు సంస్థాన్ నారాయణపూరం మండల కేంద్రంలో రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని కార్డుదారులకు సన్నాబియ్యం కార్యక్రమం పంపిన చేస్తుందని ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకొని కొన్ని వేల కుటుంబాలలో పేదలకు అన్నం పెడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మునుగోడు నియోజకవర్గం లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి రేపు జరిగే మంత్రివర్గ విస్తరణ లో మంత్రి పదవి ఖాయమని నియోజకవర్గ తాగు సాగునీటి అన్ని రంగాలులో మంత్రి గా ముందుకు తీసుకెళ్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి,నారాయణపూర్ తాసిల్దార్ కృష్ణ, డిటిసిఎస్ బాలమణి, పిఏసిఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త పబ్బు రాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ బుజ్జి నాయక్, గుత్త ఉమా ప్రేమ చందర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి వీరుమళ్ల భానుమతి వెంకటేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మందు గల బాలకృష్ణ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఏపూరి సతీష్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జక్కలి ఐలయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీను నాయక్,మండల కాంగ్రెస్ నాయకులు ఉప్పల లింగస్వామి, మాజీ సర్పంచులు జైపాల్ రెడ్డి, నోముల మాధవరెడ్డి, కొన్ రెడ్డి నరసింహ, కాంగ్రెస్ నాయకులు మునగాల రమణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కడి చంద్రారెడ్డి, రేషన్ డీలర్లు మహేశ్వరం స్వామి యాదయ్య, చిలుకూరి శ్రీనివాస్ కే లక్ష్మయ్య, కే శ్రీనివాస్, కే శంకరయ్య, పాపిరెడ్డి భూపాల్ రెడ్డి, సత్తయ్య, అనసూయ, లింగయ్య, జగదీశ్వరి, రాములు, పాండు గన్నిరాం , విజయలక్ష్మి,శంకర్, రవి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి, బి ఆర్ ఎస్ దొంగ రాజకీయాలు మానీతే మంచిది

- రామన్నపేట మండలం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కల్లూరి శివకుమార్

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 1**



అప్పట్లో 1700 ఎకరాలతో 1976 లో హైదరాబాద్ సెంటర్ యూనివర్సిటీ స్థాపించిందే కాంగ్రెస్ ప్రభుత్వం.దాని పక్కన ఉన్న 800 ఎకరాలు నాడు ఉమ్మడి రాష్ట్రంలో 2003లో ఐ ఎం జి భారత్ అనే సంస్థకు అప్పగించింది నాటి తెలుగుదేశం ప్రభుత్వం. ఆ సంస్థ పనులు ప్రారంభించకుండా లేట్ చేయడం ద్వారా తర్వాత 2004లో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఆ భూమిని ప్రభుత్వ అవసరలకు తీసుకోవాలి అని కోరింది. దానిపై ఐ ఎం జి భారత్ సంస్థ కోర్టుకి వెళ్ళింది నాటి నుండి కోర్ట్ లో పోరాడంగా నేడు రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రభుత్వం గెలిచింది. టిజిఐఐసి విజ్ఞప్తి మేరకు శేర్లింగంపల్లి మండలం డిప్యూటీ కలెక్టర్ మరియు తాసిల్దార్ రెవెన్యూ రికార్డుల ప్రకారం కంచ గచ్చిబౌలి సర్వే నెంబర్ 25 లోని 400 ఎకరాల పోరంబోకు సర్కారీ అంటే ప్రభుత్వ భూమి అని నిర్ధారించారు. సర్వేలో ఒక అంగుళం భూమి కూడా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీది కాదని తేలింది.

## మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి.

- సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత నకిరేకంటి సతీష్

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 1**



అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, నిరంతరం పోరాడి తమ జీవితాలను త్యాగం చేసిన భారత ఉప ప్రధాని, సంఘ సంస్కర్త స్వాతంత్ర సమరయో ధులు బాబు జగ్జీవన్ రామ్, భారతదేశ మొట్టమొదటి సామాజిక విప్లవకారుడు, అక్షర జ్ఞానం కొందరిది. కాదని అక్షర జ్ఞానం అందరిదని తెలిపిన మహాత్మ జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ల జయంతోత్సవాలను పండగల జరుపుకుందామని కోరారు.

## లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



**మునుగోడు వెలుతురు ఏప్రిల్ 01:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సన్న బియ్యం పంపిణీ పథకంలో భాగంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారి ఆదేశానుసారం మంగళవారం రోజున మునుగోడు మండలం, ఊకోండి గ్రామం లో రెవెన్యూ అధికారులతో కలిసి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ గారు. మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు.మాజీ ఎంపీపీలు పొలగోని సత్యం. కర్నాటి స్వామి.మేడి యాదయ్య నాగలక్ష్మి. మాజీ జెడ్పిటిసి జాజుల అంజయ్య. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి. మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి.మాజీ సర్పంచులు నడింపల్లి యాదగిరి.మిర్యాల వెంకన్న.మధగోని రాజేష్. పాలకురి యాదయ్య.బూడిద లింగయ్య.నిమ్మల స్వామి.నాయకులు మాదగోని దేవలోకం. భీమగోని ముత్యాలు చలిచీమల యాదగిరి. బొడ్డుపల్లి యాదగిరి.బోయపల్లి వెంకన్న. బోయపల్లి శంకర్. బోయపల్లి రాజు. బొడ్డుపల్లి సత్తయ్య. సామల వెంకటేశం. బొడ్డుపల్లి కృష్ణయ్య.ధర్పల్లి శంకర్. తదితరులు పాల్గొన్నారు

## బిజెపి ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ

**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 1 :**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల సందర్భంగా అనేక హామీల తో అధికారంలోకి వచ్చి ఇప్పటికీ 450 రోజులు గడిచింది ఇచ్చిన హామీలను 6 గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చేనందున చౌటుప్పల్ మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నేలపట్ల, మరియు రెడ్డి బావి గ్రామాలలో ప్రజలలో చైతన్యం రావడం కొరకు మహిళలకు మహాలక్ష్మి పథకం2500, వృద్ధాప్య పింఛన్లు చేయూత 4000, విద్యార్థినులకు స్కూటీలు, రైతు భరోసా పథకాల పై దరఖాస్తులను ప్రజల నుండి స్వీకరించడం జరిగింది ఈ దరఖాస్తు లను మండల రెవెన్యూ అధికారులకు, ఆర్డిఓ మరియు జిల్లా కలెక్టర్ గారికి అందించడం జరుగుతుంది. ఈ పథకాలు అమలు చేసే వరకు భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది ఈ కార్యక్రమాలు మంగళ వారం రోజు డి నాగారం, ఆరెగూడెం, కాట్రేవు గ్రామాలలో నిర్వహించడం జరిగింది. చౌటుప్పల్ మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్ ఉడుగు యాదయ్య, కంది లక్ష్మారెడ్డి, మునగల తిరుపతిరెడ్డి, చినుకని మల్లేష్



యాదవ్, మహిపాల్ రెడ్డి, శాగా చంద్రశేఖర్ రెడ్డి, మునగాల రాజశేఖర్ రెడ్డి, కట్ట కృష్ణ, దిండు భాస్కర్, నూనె మాధవి సహదేవ్, రేవల్లి స్వప్న, సత్యనారాయణ, మునగాల జనార్దన్ రెడ్డి, నిమ్మల సత్యనారాయణ, మహేష్, బద్దం కృష్ణ, అనంతుల ఐలయ్య, గంగనబోయిన ఐలయ్య, వికార సుధాకర్ రెడ్డి, బొంగు వెంకటేశం గౌడ్, మలిగ వెంకటేశం, పి శ్రీనివాస్ చారి, సిలువేరు రమేష్, పాక రఘు, పందుల భరత్, పందుల వెంకటేశం, అందే అడవయ్య, సుంకంటి ఆదిరెడ్డి, గోధుమగడ్డ నరేందర్ రెడ్డి, బచ్చా ఐలయ్య, కడగంచి శ్రీశైలం మల్లయ్య, మహేష్, అంజయ్య, శ్రీనివాసులు, బొడుపలి మల్లేష్, గట్టు పవన్, పిన్నింటి చంద్ర శేఖర్రెడ్డి, జూపల్లి మల్లేష్, పులిగిల్ల లక్ష్మణ్, బాబు చారి తదితరులు పాల్గొన్నారు .

## ఏకగ్రీవంగా శ్రీ లక్ష్మి నరసింహ స్వామి తాపీ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా పబ్బాల శ్రీరాములు వంశరాజ్, ప్రధాన కార్యదర్శిగా పబ్బాల రాజు వంశరాజ్**



**యాదగిరిగుట్ట , వెలుతురు న్యూస్, ( ఏప్రిల్ 1 )**
యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి తాపీ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తాపీ కార్మిక సంఘం పెద్దలు ,కార్మికుల ఏకాభిప్రాయంతో సంఘం నూతన కమిటీ లో 18మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . అధ్యక్షులుగా పబ్బాల శ్రీరాములు వంశరాజ్, ఉపాధ్యక్షులుగా దొమ్మాట కుమ్మరి సంజీవ, ప్రధాన కార్యదర్శిగా పబ్బాల రాజు వంశరాజ్ , కోశాధికారిగా పబ్బాల ఉప్పలయ్య వంశరాజ్, సహాయ కార్యదర్శిగా పబ్బాల రమేష్ వంశరాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ నూతన కమిటీ ఎన్నికను మాజీ అధ్యక్షులు ముఖ్యర్ల కొమురయ్య యాదవ్, నాగపురి శ్రీను, కంబాల జహంగీర్, ముఖ్యర్ల సత్యనారాయణ యాదవ్ తదితరుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ ఎన్నికలో 150మంది తాపీ కార్మిక సంఘం సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పబ్బాల శ్రీరాములు వంశరాజ్, ప్రధాన కార్యదర్శి పబ్బాల రాజు వంశరాజ్ లు మాట్లాడుతూ తాపీ కార్మిక సంఘం సభ్యులు మాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు అందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఈ కార్మిక సంఘంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అనుకోని సంఘటనలు జరగకుండా చూసుకునేందుకు తాము పూర్తి బాధ్యత వహిస్తామని అన్నారు. దినసరి కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడిపే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే బిల్డింగ్ కాంట్రాక్టు విషయంలో ఎవరైనా ఇంటి యజమానులు గుత్తేదారులకు నష్టం కలిగించే విధంగా చేస్తే గుత్తేదారులకు , సంఘం సభ్యులకు వెన్నంటూ ఉంటూ వారికి తగిన విధంగా న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన గత కమిటీ సభ్యులకు , సంఘం పెద్దలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ కార్యవర్గాన్ని సంఘం సభ్యులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందించారు.

## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలి

- సిపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్ లు అప్రజాస్వామికం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 1**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై దాడిని చేయడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న భూములను వేలం వేసి కార్పొరేట్ కంపెనీలకు బుట్ట చెప్పాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన సరైంది కాదని ప్రజాస్వామ్యతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులను ప్రయోగించి దాడి చేసి అరెస్టు చేసి కేసులు పెట్టడం ప్రజాస్వామికమని అన్నారు. 400 ఎకరాల్లో అడవిని ధ్వంసం చేసి పర్యావరణాన్ని విధ్వంసం చేసే ప్రక్రియ మానుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలుపుతున్న సిపిఎం కార్యకర్తలను ఏంటని ప్రశ్నించారు. వెంటనే భూముల వేలాన్ని ఆపకపోతే సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన తప్పదని హెచ్చరించారు. వనం ఉపేందర్ కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంత, బోయిని ఆనంద్ కల్లూరి నగేష్, మండల కమిటీ సభ్యులు గన్నబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు, గొరిగే సోములు, నాయకులు నీల ఐలయ్య,గంటెపాక శివ కుమార్,డివై ఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్,మేడి గణేష్,మునికుంట్ల లెనిన్,అంబటి మల్లారెడ్డి,ఎర్ర రవీందర్,శానగొండ వెంకటేశ్వర్లు,పాల్వంచ జగతయ్య, సత్యం, జనపాల లక్ష్మణ్,తుర్కపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉమ్మడి జిల్లా డీసీసీబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి





**మునుగోడు వెలుతురు ఏప్రిల్ 01:**
అశ్వసేన యూత్, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఉమ్మడి జిల్లా డీసీసీబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం అభినందనియం అన్నారు ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసి మరెందరికో మార్గదర్శకం కావాలని చేరుకున్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పిటిసిలు,మాజీ సర్పంచులు, వివిధ హెూదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు వివిధ ప్రజా సంఘాల నాయకులు యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేత లకు బహుమతుల ప్రధానోత్సవం చేసిన డివైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి



**గట్టుప్పల్ వెలుతురు ఏప్రిల్ 01:**
నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో ఉగాది మరియు రంజాన్ సందర్భంగా గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ను నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగానే మంగళవారం రోజున బహుమతుల ప్రధానోత్సవం చేయడం జరిగింది. కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి హాజరైనారు. మండల అధ్యక్షులు టేకుమట్ల కృష్ణ, ఉపాధ్యక్షులు పరసగొని నితిన్, సహాయక కార్యదర్శి రావుల వెంకటేష్, క్రీడాకారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మను గడ సాధించలేవు!!!

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 1**



తెలంగాణ తొలి దశ ఉద్యమ సాక్షిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పడ్డది. అలనాటి ప్రధాని ఇందిరా గాంధీ హైదరాబాద్ శివారు కంచ గచ్చిబౌలిలో 2253 ఎకరాలను కు కేటాయిస్తూ హైదరాబాద్ కేంద్రీయ యూనివర్సిటీ ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. యూనివర్సిటీ కి 2003 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, 400 ఎకరాలను ఐఎంజి భారత కు కేటాయిస్తూ జీవో జారీ చేశారు యూనివర్సిటీ భూములను ప్రైవేటు సంస్థకు అప్పగించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఉదృతమైన ఆందోళనలు చేపట్టడంతో 2004 జనవరిలో గోపన్న పల్లే రెవిన్యూ గ్రామంలో లో 397 ఎకరాల భూమిని తిరిగి కేటాయించడం జరిగింది. అయినా గాని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ విభాగం, విద్యార్థులు, ఒప్పుకోవడంతో తీవ్రమైన ఉద్యమం ఉవ్వెత్తున ఎగసడంతో అప్పటి ప్రభుత్వం యూనివర్సిటీ భూములను కేటాయించడం ఉపసంహరించుకోవడం జరిగింది. ఆ తర్వాత గోపన్నపల్లిలోని భూములను టాటా ఇన్స్టిట్యూట్ ఫర్ ఫండమెంటల్ రీసెర్చ్ కు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎనిమల్ బయోటెక్నాలజీకి, ప్రభుత్వం అప్పగించడం జరిగింది. తద్వారా కంచ గచ్చిబోలిన 400 ఎకరాల భూమి యూనివర్సిటీకి అని భావించడం జరుగుతుంది. అలనాటి పరిస్థితులు తిరిగి పునరావృతం అయ్యేలా ఇప్పటి ప్రభుత్వం మరల ఈ 400 ఎకరాల భూమిని బహిరంగ వేలం చేయడం దీన్ని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యహితంగా, హెచ్ సి యు ,విద్యార్థులు సమాజ హితం కోసం పోరాటం మొదలుపెట్టారు .భవిష్యత్ తరాలకు యూనివర్సిటీ పునాదులు వేయాలని తెగించి విద్యార్థులు కొట్లాడుతున్నారు. అలాంటి విద్యార్థులను అర్ధరాత్రి పోలీసు మరియు ప్రైవేటు సైన్యంతో ఈ ప్రభుత్వం తీవ్ర అణిచివేతకు గురిచేస్తుంది. అంతేకాకుండా 400 ఎకరాలు భూములు ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని ప్రకటించడం హెచ్సీయూ రిజిస్టర్ తీవ్రంగా ఖండించడంతోపాటు టిజిఐఐసి ప్రకటన పూర్తిగా అవాస్తవాన్ని అక్కడి భూముల్లో ఎలాంటి సర్వే గాని భూమి బదలాయింపు గాని యూనివర్సిటీ అధికారులు అనుమతులు గాని ఆమోదంగానే తెలుపలేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా దేశంలో పేరొందిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ భూములను బదలాయించాలంటే భారత రాష్ట్రపతి తో నియమతులైన ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ అనుమతితోనే భూ బదలాయింపులు చేయాల్సి ఉంటుంది. ఈ యూనివర్సిటీ భూముల్లో జీవవైద్యం ,పర్యావరణం పరిరక్షణ , పక్షులు,అడవి లా తలపిస్తుంది .అంతేకాకుండా ఔషధ మొక్కలు పచ్చిక బయలు శిలా సంపద ,నీటి వనరులు, కూడా ఉన్నాయి. ప్రభుత్వం వారి యొక్క ఉచిత పథకాలను మరియు అధికారాన్ని కాపాడుకోవడానికి ఇలాంటి ప్రకృతి జీవవైవిధ్యంగాల స్థలాలను అమ్మి పాలన చేయడం అత్యంత దుర్మార్గం. కావున వెంటనే దీన్ని ఉప సంహరించుకొని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థుల వాదనను ఏకీభవిస్తూ , యూనివర్సిటీ అధికారుల యొక్క ప్రకటనలను పరిగణన లోకి తీసుకుంటూ కంచ గచ్చిబౌలి యూనివర్సిటీ భూముల నుండి వెంటనే ప్రభుత్వ బలగాలను యంత్రాలను, ఉపసంహరించుకొని ప్రశాంతమైన వాతావరణానికి విద్యార్థుల భవిష్యత్తుకు, పునాదులు వేయాల్సిందిగా ప్రభుత్వాన్ని బాధ్యత గల విద్యార్థి ,మేధావులు కోరుకుంటున్నారు. అంతేకాకుండా విద్యార్థుల తోటి యువతతోటి పెట్టుకున్న ఏ ప్రభుత్వం మ నగడ సాధించలేదని చెప్పవచ్చు. పదేపదే రాష్ట్ర ముఖ్యమంత్రి గత ప్రభుత్వం అప్పులు చేసిందని ప్రభుత్వ భూములు అమ్ముకుందని ప్రతి సమావేశంలో చెబుతూ ఈ ప్రభుత్వం కూడా ప్రజా పాలన పేరుతో అవే తప్పులు అదేవిధంగా అనుసరించడం వారి ద్వందనీతికి నిదర్శనం. ప్రభుత్వం ఆదాయ వనరులను పెంచుకొని ఖర్చులను తగ్గించుకొని ఉచితలను నియంత్రిస్తూ ముందుకు సాగడం రాష్ట్ర భవిష్యత్తుకు ఉత్తమమైన మార్గం. విశ్లేషణ కూనూరు శ్రీనివాస్ గౌడ్.



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 1**
తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సన్న బియ్యం లాంచింగ్ ప్రోగ్రాం రామన్నపేట మండలంలో, రామన్నపేట గ్రామం షాప్ నెంబర్ 1 గ్రామపంచాయతీ ప్రక్కన 2.4.2025 బుధవారం ఉదయం 11:30 గంటలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంచే ప్రారంభోత్సవం కలదు. కావున మండల పత్రిక మిత్రులందరు హాజరు కాగలరని కోరుచున్నాము. ఇట్లు తహసిల్దార్ రామన్నపేట

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

*ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి యాదగిరిగుట్టలో పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి*

**యాదగిరిగుట్ట, వెలుతురు న్యూస్, ( ఏప్రిల్ 1 )**
పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వారి సర్వతో ముఖాభివృద్ధి కోసం అనుక్షణం పనిచేస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లు అన్నారు. ప్రజాపాలన లో అందరికి ఆహార భద్రత సన్నబియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయమన్నారు . మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ఉచితంగా అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటి వెంకట రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు లతో కలిసి



ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు నియజకవర్గం నుండి పెద్ద ఎత్తున్న మహిళలు,ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య లు మాట్లాడుతూ రైతుల పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రభుత్వం 2వేల 858 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఒక్క పేద కుటుంబానికి ప్రతి మనిషికి ఆరు కిలోల చొప్పున ప్రతి ఒకరికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. మహిళల ను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని,ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం ప్రారంభించిన ముఖ్యంగా ముందుగా మహిళలకు ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా మొదటిగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు , ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలు ద్వారా ప్రతి ఒక్క అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి 500 కే గ్యాస్ ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్క అర్హులైన పేద కుటుంబానికి ఇంటికి 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి సంక్షేమ కార్యక్రమంలో మహిళలను చైతన్య పర్చుతూ వారు ముందంజలో ఉండేలా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ప్రభుత్వం వచ్చాక ఎన్నో బ్రిడ్జిలు నిర్మించి ఆలేరు నియోజకవర్గంలో 120 చెరువులు నింపి పంటలు సమృద్ధిగా పండించుకుంటున్నామని అన్నారు. నీళ్లు ,నిధులు, నియామకాలు అనేదే ప్రభుత్వ లక్ష్యమని దానికి అనుగుణంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి నాయకులు కానుగు బాలరాజు గౌడ్ ,గుండ్లపల్లి భరత్ గౌడ్, ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బందారపు బిక్షపతి , గుండు నరసింహ ములుగు నరసింహ బరిగే రామచందర్ బూడిద మధు తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికి సన్న బియ్యం చేరాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఆకాంక్ష

- రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి





**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 01:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని ముసానగర్ కాలనీలో తెలంగాణ ప్రభుత్వం(పౌర సరఫరాల శాఖ) రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కార్యక్రమంను తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకాన్ని లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సెట్విన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తీసుకువస్తున్నామని, అందులో భాగంగా ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రవీందర్, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సింలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ భీమయ్య, మాజీ వైస్ యం.పి.పి.వి.రాములు, జమిలాలోద్దిన్, శుక్లనర్ధన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, అక్బర్, మల్లారెడ్డి, గుండా రెడ్డి, ఖాసీంపూర్ మాజీ యం.పి.టి.సి రాజు, ఇమామ్ పటేల్ , యూత్ కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన గజం భూమిని కూడా వొదిలే ప్రసక్తే లేదు

- బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ ఇంచార్జ్ రాకేష్...



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 01:**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ లోని యునివర్సిటీ లకు చెందిన భూముల జోలికి వొస్తే ఊరుకునేది లేదు అని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ రాకేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేష్ మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన వందల ఎకరాల అటవీ ప్రాంత భూముల లోని చెట్లను నరికి వేయడానికి జె సి బి లు తెచ్చి విద్యార్థులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు అని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు ఆ యూనివర్సిటి భూములను బుల్డోజర్ ల సహకారం తో క్లీన్ చేసి భూదందకు తెరలేపింది అని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమా లేక బుడోజర్ల ప్రభుత్వమా అని ఎద్దేవ చేసారు. రేవంత్ రెడ్డి తన తమ్ముళ్ళ కోసం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి తమ తమ్ముళ్లకు యూనివర్సిటి కి చెందిన ప్రభుత్వ భూములను కట్టబెట్టాలని చూస్తున్నారు అని అన్నారు. ప్రభుత్వ భూములను అమ్మలని చూస్తే విధ్యార్థులు చూస్తు ఊరుకోబోరని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## రేషన్ షాప్ ల ముందు నరేంద్రమోడీ ఫోటో పెట్టకపోతే ఆందోళనలు చేపడతాం...

- భీమదేవరపల్లి మండల శాఖ నేతలు....



**భీమ్ దేవరపల్లి వెలుతురు ఏప్రిల్ 01:**

భీమ్ దేవరపల్లి మండలంలోని అన్ని రేషన్ డీలర్ల దుకాణాల వద్దా ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయకపోతే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మండల శాఖ అధ్యక్షులు శ్రీ రామోజీ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం రోజున మండల కేంద్రంలోని స్థానిక రేషన్ డీలర్ షాప్ వద్ద ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింత రాజకీయం చేస్తుందని , మోడీ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా ఉచితంగా బియ్యం ఇస్తుంటే రేషన్ డీలర్ దుకాణం వద్ద మోడీ ఫోటో పెట్టకపోవడం దారుణం అన్నారు. , పేద బడుగు బలహీన వర్గాల కోసం ఒక్క కిలో కి 40 రూపాయలు వెచ్చించి ప్రజలకు అందిస్తున్నా నరేంద్ర మోడీ ఫోటో పెట్టకుండా, కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి. స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ఫోటోను మాత్రమే పెట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ విషయంలో అధికారులను ప్రధాని మోదీ ఫోటో పెట్టాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం నుండి తమకు ఎలాంటి ఆదేశాలు లేవని సమాధానం చెబుతూ దాటవేస్తున్నారన్నారు. రాబోయే రోజులలో అన్ని గ్రామాలలోని రేషన్ డీలర్ షాపుల వద్ద నరేంద్ర మోడీ ఫోటో పెట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే, భారతీయ జనతా పార్టీ భీమదేవరపల్లి మండల శాఖ ద్వారా అన్ని రేషన్ షాపుల ముందు ఆందోళన చేపడతామని , అలాగే పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోలు పెడతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి పృధ్విరాజ్ గౌడ్. సీనియర్ నాయకులు దొంగల కొమరయ్య. ప్రధాన కార్యదర్శి గుండెల్ని సదానందం,మండల ఉపాధ్యక్షులు దొంగల వేణు, ఓబీసీ ముర్చా అధ్యక్షులు దొంగల రాణా ప్రతాప్, శక్తి కేంద్రం ఇన్చార్జులు బైరి సదానందం, శనిగరపు ఐలయ్య, కాలేరు వికాస్, బొల్లంపల్లి శ్యామ్, బొజ్జపురి పృథ్వీరాజ్, కత్తుల విజయ్, పట్ల అఖిల్ తదితరుల పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టకు సీఎం వచ్చారా ..!!?

- స్థానికంగా చర్చనీయాంశంగా మారిన మంత్రి కోమటిరెడ్డి పర్యటన
- హెలికాప్టర్లో వచ్చి, భారీగా కార్ల కాన్వాయ్ తో అందరి దృష్టిని ఆకర్షించిన మంత్రి
- ముఖ్యమంత్రే వచ్చారా ? అన్నంతగా సందడి చేసిన మంత్రి కోమటిరెడ్డి
- పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు, భారీ జన సమీకరణ
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషితో విజయవంతమైన సభ, మంత్రి కోమటిరెడ్డి పర్యటన
- అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపిన కోమటిరెడ్డి పర్యటన



> యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి వస్తున్నారా !!? వచ్చేది ముఖ్యమంత్రేనట .. అదిగో హెలికాప్టర్... అవునా...? మాకు తెలియదే...!! ముందుగా ఎవరూ అనలేదే. .. !! అదిగో ముఖ్యమంత్రి హెలికాప్టర్ లో వస్తున్నారు... చూడు చూడు....

( పుట్ట హనుమంత్ )

**యాదగిరిగుట్ట , వెలుతురున్యూస్ , ( ఏప్రిల్ 1 )**

ఇది యాదగిరిగుట్టలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన చర్చ... ఎక్కడ చూసినా ఇదే చర్చ ... ఆయా కాలనీలలో ప్రధాన వీధుల్లో పలువురు ఆసక్తికరంగా ఈ విధంగా చర్చించుకోవడం కనిపించింది . రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం నాటి యాదగిరిగుట్ట పర్యటన ఆద్యంతం ఆసక్తికరంగా మారింది. స్వయంగా ముఖ్యమంత్రే యాదగిరిగుట్టకు వచ్చారా ? అన్నట్లుగా ఆ స్థాయిలో హడావుడి జరిగింది. పోలీసు బందోబస్తు , ప్రధాన రహదారిపై మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య భారీ కాన్వాయ్ వెళ్తున్న సమయంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ ను కొద్దిసేపు నిలిపివేయడం తదితర అంశాలు ఆసక్తికరంగా, చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది . ఈ మేరకు ఏప్రిల్ 1న ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి పర్యటన ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఖరారు అయింది . ఆయన మంగళవారం హైదరాబాదులోని బేగంపేట ఎయిర్పోర్ట్ నుండి హెలికాప్టర్లో నేరుగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కనగల్ మండలం జి ఎడవెల్లి గ్రామానికి వెళ్లి అక్కడ పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడి నుండి నేరుగా హెలికాప్టర్లో యాదగిరిగుట్టకు చేరుకున్నారు. ఆయన హెలికాప్టర్ యాదగిరిగుట్టలో ఆకాశంలో చక్కర్లు కొడుతున్న సమయంలో స్థానిక ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు. అదిగో యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి వస్తున్నారు.. అంటూ పలువురు చర్చించుకోవడం కనిపించింది . మంత్రి కోమటిరెడ్డి హెలికాప్టర్లో వచ్చి పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతంలో దిగారు. అక్కడ ఆయనకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శాలువా కప్పి పూల బొకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి భారీగా ఏర్పాటు చేసిన కార్ల కాన్వాయ్ తో మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దేవస్థానం పార్కింగ్ ఏరియా నుండి యాదగిరి పల్లి, గాంధీనగర్, వైకుంఠ ద్వారం బ్రిడ్జి మీదుగా ముందుకు సాగారు. ఈ సమయంలో పోలీసులు ఆ రూట్లో ట్రాఫిక్ ను కొద్దిసేపు నిలిపివేశారు. మంత్రి కోమటిరెడ్డి , ప్రభుత్వ విప్ ఐలయ్య కాన్వాయ్ అక్కడి నుండి నేరుగా గుండ్లపల్లి ప్రాంతంలో మెయిన్ రోడ్ లో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్ కు చేరుకుంది . అక్కడ పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు . యాదగిరిగుట్టలో ప్రధాన రహదారి వెంట, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించే ఫంక్షన్ హాల్ సభాస్థలిలో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన స్థాయిలో మంత్రి కోమటిరెడ్డి పర్యటన సాగడంతో పెద్ద ఎత్తున హడావుడి నెలకొంది. ఈ కార్యక్రమానికి జన సమీకరణ కూడా పెద్ద ఎత్తున చేశారు. ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇటు జన సమీకరణ విషయంలోనూ మంత్రి కోమటిరెడ్డి పర్యటన విజయవంతం చేసేందుకు ప్రత్యేక కృషి చేశారు. దీంతో కోమటిరెడ్డి పర్యటన, పేదలకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున విజయవంతమైంది. కాగా నియోజకవర్గం లోని వివిధ మండలాలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు . ఫంక్షన్ హాల్ మొత్తం పెద్ద ఎత్తున తరలివచ్చిన జనంతో కిక్కిరిసిపోయింది. ఫంక్షన్ హాల్ లో స్థలం సరిపోక పోవడంతో చాలావరకు జనం ఫంక్షన్ హాల్ బయట రోడ్ల వెంటే ఉండిపోయారు. దీంతో యాదగిరిగుట్టలోని ప్రధాన రహదారి వెంట పెద్ద ఎత్తున హడావుడి నెలకొంది. ఏది ఏమైనా మంత్రి కోమటిరెడ్డి పర్యటన ముఖ్యమంత్రి పర్యటన స్థాయిలో భారీగా హంగామాతో , ఆర్భాటంగా జరగడంతో ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారడంతో పాటు ఆయన అభిమానులు కాంగ్రెస్ కార్యకర్తల్లో పెద్ద ఎత్తున జోష్ ను నింపింది.

## జహీరాబాద్ టౌన్, రూరల్, కోహిర్ పోలీసు స్టేషన్‌ల జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- సరిహద్దులో నుండి ఎలాంటివి అక్రమ రవాణా జరగకుండా నిఘా కట్టుదిట్టం చేయాలి..
- ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ ఆప్స్, సైబర్ క్రైమ్స్ గురించి, ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి...
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.







**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 01:**

సంగారెడ్డి జిల్లా పరిధిలోని జహీరాబాద్ టౌన్, జహీరాబాద్ రూరల్, కోహిర్ పోలీసు స్టేషన్ లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. మంగళవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణ, సిబ్బంది బ్యారెక్ పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డ్ లను తనిఖీ చేస్తూ.. హిస్టరీ షీటర్ లను రెగ్యులర్ గా తనిఖీ చేస్తూ.. రికార్డులో అప్ డేట్ చేయాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ముఖ్యంగా మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని యస్.హెచ్.ఓ కు సూచనలు చేశారు. రాష్ట్ర సరిహద్దు పోలీసు స్టేషన్ లైన కోహిర్ జహీరాబాద్, చిరాగ్ పల్లి ప్రాంతాల నుండి ఎలాంటివి అక్రమ రవాణా జరగకుండా నిఘా కట్టుదిట్టం చేయాలని డియస్పీ కి సూచలనలు చేశారు. సరిహద్దు ప్రాంతాలలో మరియు ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహించాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్ లుగా గుర్తించి, సైన్ బోర్డు లను ఏర్పాటు చేసే విధంగా చూడాలని అన్నారు. ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్ మరియు రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యస్.హెచ్.ఒ కు సూచనలు చేశారు. హిస్టరీ షీటర్లు, సంఘవిద్రోహశక్తులు, అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎవరైన చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, శాంతి భధ్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, అట్టి వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎస్పీ తోపాటు జహీరాబాద్ డియస్పీ రామ్ మోహన్ రెడ్డి, సిఐ శివలింగం ఉన్నారు.

## నీరు అందక పంట పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుంది

- పంటలు కోతకు వచ్చేచివరి దశల్లో ఉన్నాయి. రైతుల పంటలను కాపాడండి.... సాగునీటిని అందించండి...
- బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి...



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 01:**

కరీంనగర్ రూరల్ గ్రామాల్లో, కొత్తపల్లి లో సాగునీరు లేక కోతకు వచ్చిన పంటలు కాపాడుకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ, ప్రభుత్వం వెంటనే చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించడానికి చర్యలు చేపట్టి, రైతుల పంటలను కాపాడాలని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి డిమాండ్ చేశారు.బిజెపి కిసాన్ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్ రూరల్ మండలం, కొత్త పల్లి లో నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నాడి రాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలో ఉన్న డి 93 కాలువ ద్వారా నీరు అందక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఇట్టి కాలువ ద్వారా ప్రధానంగా చివరి ఆయకట్టు గ్రామాల వరకు పొలాలకు నీరు అందక వందల ఎకరాలు నష్టపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. నీళ్లు లేక పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డి 93 కాలువకు అందవలసిన నీరు అందని కారణంగా , కాలువ మీద ఆధారపడి పంటలు వేసుకున్న రైతులు , నీరు అందక నష్టాల పాలవుతున్నారని, ప్రస్తుతం ఇక్కడి ప్రాంతంలోని పంట పొలాలు ఎండిపోయే స్థితికి వచ్చాయన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డి 93 కాలువ కు సాగు నీటిని విడుదల చేసి, రైతులను ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్త పల్లి మాజీ ఎంపీపీ వాసాల రమేష్, మాజీ బిజెపి పట్టణ అధ్యక్షులు శేఖర్, లక్ష్మారెడ్డి నరసింహారెడ్డి, హరిప్రసాద్, మహేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సంపత్, బోనాల మోహన్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు చిట్కూరు శ్రీనివాస్, వేముల చంద్రశేఖర్, రవి ప్రసాద్ లతో పాటురైతులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అందిస్తుంది కేంద్ర ప్రభుత్వమే....

- కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టి, ప్రజలను తప్పుదారి పట్టిస్తుంది..
- బిజెపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్..

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 01:**



దేశవ్యాప్తంగా ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్న ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని , ప్రస్తుతం రేషన్ షాపుల్లో కిలో బియ్యం కోసం రూ. 40 రూపాయలు ఖర్చు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రూ. పది రూపాయలు కలిపి ఏదో ఉద్ధరించినట్టు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని , వాస్తవాలు దాచిపెట్టి ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని బిజెపి కాంటెస్టెంట్ కార్పొరేటర్ తోట సాగర్ విమర్శించారు. మంగళవారం రోజున కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ హౌసింగ్ బోర్డ్ లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఈ విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారన్నారు. రేషన్ బియ్యం పంపిణీ విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలానే గొప్పలు చెప్పుకుంటూ, ప్రజలను మభ్యపెట్టేప్రయత్నం చేసిందన్నారు. వాస్తవాలు గ్రహించిన ప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారన్నారు. రేషన్ బియ్యం పంపిణీలో కిలో బియ్యం కోసం కేంద్ర ప్రభుత్వం 40 రూపాయలు ఇస్తే , రాష్ట్ర ప్రభుత్వం. పది రూపాయలు మాత్రమే కలిపి సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే అంతా తామే ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం, ప్రచారం చేసుకోవడం పై ఆత్మ విమర్శన చేసుకోవాలన్నారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారాలతో, అవాస్తవాలతో ప్రజలను మోసం చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సరైన సమయంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు. కరోనా కష్టకాలం నుండి నేటి వరకు ఉచిత బియ్యం అందిస్తున్న మోదీ ప్రభుత్వంపై ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని , సన్న బియ్యం విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

## బెల్లంపల్లి లో ప్లెక్సీ తొలగించవద్దని ధర్నా

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ కేంద్రంలోని కాంట చౌరస్తాలో ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్లెక్సీలను పెట్టి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ప్లెక్సీలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. తొలగిస్తున్న ప్లెక్సీలను అడ్డుకొని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు గౌస్ ప్లెక్సీ దగ్గరే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి పట్టణం స్థానిక మార్కెట్ ఏరియాలోని మైనారిటీ సభ్యులు గౌస్ పెట్టిన ప్లెక్సీని మున్సిపల్ కార్మికులు తీసివేయడానికి ప్రయత్నించారు. దీంతో ఆయన అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్లెక్సీలను తీయాలని ఉద్దేశం ఉంటే పట్టణంలోని అన్ని ప్లెక్సీలను తీసేయాలని డిమాండ్ చేశారు.

## అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండలంలో 3217005, 3217012 నంబర్లు గల చౌక ధరల దుకాణాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు తో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారి కడుపు నిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సన్నబియ్యం చేరాలన్న చారిత్రాత్మక పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌక ధరల దుకాణాల నిర్వాహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాజీవ్ యువ వికాసం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01**

నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అవకాశం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ పథకం ద్వారా చేయూత అందించడం జరుగుతుందని, అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 50 వేల రూపాయల లోపు రుణం 100 శాతం మాఫీ, 1 లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం రాయితీ, 1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 2 లక్షల రూపాయల నుంచి 4 లక్షల రూపాయల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని, రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతిరోజు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. లే అవుట్ క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్.ఆర్.ఎస్ రుసుము చెల్లింపుదారులకు అవగాహన కల్పించి, సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు,రేపు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి,

- దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు
- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎ. పురుషోత్తం

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01**

జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మహనీయుల వర్ధంతి, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎ. పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీ ఉదయం 11 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి, 3వ తేదీ ఉదయం 11 గంటలకు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని, అధికారులు, సంఘ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకఉగాది



**వెలుతురు,సిటీ కల్చరల్, 01ఏప్రిల్ :**

తెలుగు సాంస్కృతి సంప్రదాయాలకు ఉగాది వేడుకలు ప్రతీకలని అని మాజీ ఎమ్మెల్యే ఎన్ వివిఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఉగా ది పండుగను పురస్కరించుకొని సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆ ధ్వర్యంలో వసంతోత్సవం పేరిట వారంతరం కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఈసీఐఎల్ లోని కళ్యా ణ్ హంపి థియేటర్ లో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్ వివిఎస్ఎస్ ప్రభా కర్, సంస్కార భారతి అధ్యక్షుడు డాక్టర్ లయన్ సంఘిశెట్టి సత్యనా రాయణ, రాగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ వ్యవస్థాప కురాలు పద్మజ శర్మ పెనుమూడి, అతుల్య ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థా పకురాలు కె.లక్ష్మి దుర్గ, సంస్థ అ ధ్యక్షురాలు పద్మ కళ్యాణి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ.. ఉగాది పండుగ ను పురస్కరించుకొని సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో అనేక విలక్షణమైన కార్యక్రమాలను నిర్వహిస్తూ కళలు ,కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమ న్నారు. లక్ష్మీ దుర్గ నిర్వహణలో క ళాకారులు ప్రదర్శించిన పలు నృ త్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## దుర్గమ్మ ఆలయానికి గ్రానైట్ అందజేసిన చిలువేరు సమ్మి గౌడ్

- అడిగితే లేదనకుండా సహాయం చేసే సహృదయుడు చిలువేరు సమ్మి గౌడ్ - మాజీ వార్డు సభ్యులు బద్రు నాయక్
- మండలంలోని పలు ఆలయాలకు విరాళాలు అందజేసిన మనసున్న వ్యక్తి సమ్మయ్య గౌడ్ - మాజీ వార్డు సభ్యులు బాలు నాయక్





**కేసముద్రం వెలుతురు ఏప్రిల్ 01:**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి గుడి తండా లో నిర్మిస్తున్న కనకదుర్గమ్మ ఆలయానికి సమ్మి గౌడ్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ గ్రానైట్ అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు శాలువాతో సత్కరించి దుర్గమ్మ ఆశీస్సులు వారికి వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరుతూ మాజీ వార్డు సభ్యులు బద్రు నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఎన్నో గ్రామాలకు అడిగితే లేదనకుండా సహృదయంతో గ్రానైట్ లేదా విరాళాలు అందించి ఆయా గ్రామాల గ్రామదేవతల ఆశీస్సులు ప్రజల మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి అని అన్నారు. అదేవిధంగా మాజీ వార్డు సభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ ఏమీ ఆశించకుండా నిస్వార్థమైన ప్రేమతో నిరుపేదలకు సహాయాన్ని అందించడమే కాకుండా ఎవరు అడిగినా సరే వెంటనే స్పందించి అడిగిన ప్రతివారికి ఆలయాల నిర్మాణాలకు తన వంతు సహాయంగా విరాళాలు అందజేయడంలో ముందుండే వ్యక్తి సమ్మి గౌడ్ అని ఇలాంటి వ్యక్తికి ప్రజలు ప్రజాక్షేత్ర పాలనలో అవకాశం కల్పిస్తే ప్రతి గ్రామం అభివృద్ధి దిశలో ఉంటుందని, వారికి మా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోత్ బద్రు, బానోతు వెంకన్న (డోజర్), గుగులోత్ బద్రు, భూక్య రవి, బానోత్ మోహన్, బానోత్ సుక్య, తేజావత్ పవన్, బానోత్ రమేష్, బాధావత్ వెంకన్న భానోత్ తులసి రామ్, కొండేటి కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే... మద్యం తాగి ట్రాఫిక్ పోలీసులకు చిక్కిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్..

- బ్రీత్ అనలైజర్ పరీక్షలో షాక్
- 205 బీఏసీ పాయింట్స్ రావడంతో అవాక్కయిన ట్రాఫిక్ పోలీసులు
- మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు :
- కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ఎ.శ్రీనివాస్

**వెలుతురు,హైదరాబాద్ 01 ఏప్రిల్ :**



మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాచిగూడలోని నింబోలిఅడ్డలో మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిం చారు. నింబోలిఅడ్డ మీదుగా రైల్వే స్టేషన్ వైపు వెళ్తున్న ఓ వాటర్ ట్యాంకర్ ను ట్రా ఫిక్ పోలీసులు అనుమానంతో ఆపి తనిఖీ చేపట్టారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ ప్రతీక్ సోన్ కాంబ్లే పై బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా, 205 అల్కహాల్ కంటెంట్ పాయింట్స్ నమోద య్యాయి. ఇది అనుమతించిన పరిమి తికి మించి పోయిందని గుర్తించిన పోలీ సులు షాక్ కు గురయ్యారు. డ్రైవర్ పూర్తి గా మద్యం మత్తులో ఉండటంతో, అతని మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ పోలీసులు ట్యాంకర్ ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు సురక్షిత ప్రయాణాన్ని ఆశ్ర యించాలని అనవసరంగా మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదా లకు గురికావద్దన్నారు. డ్రంక్అండ్ డ్రైవ్ లో పట్టుబడితే అనవసరంగా కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిర గాల్సి వస్తుందని, వాహనాలు కూడా సీజ్ అవుతాయని పేర్కొన్నా రు. కొన్ని సందర్భాల్లో శిక్ష, జరిమా నా కూడా విధించాల్సివస్తుందని హెచ్చరించారు. అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనాలను తూచా త ప్పకుండా పాటించాలన్నారు. కాచి గూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి లో విరివిగా ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొ న్నారు. హెల్మెట్ ధరించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ అనిల్ గౌడ్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నా రు.

## తెలంగాణలో మరో దారుణం....

- హైదరాబాద్ లో జర్మనీ యువతిపై గ్యాంగ్ రేప్
- లిఫ్ట్ ఇస్తామని చెప్పి కారులోనే అఘాయిత్యం
- పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు
- నిందితుల కోసం గాలింపు

**వెలుతురు,హైదరాబాద్ 01ఏప్రిల్:**




తెలంగాణలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం నాగర్ కర్నూల్ జిల్లాలో దైవదర్శనానికి వచ్చిన మహిళపై సామూహిక లైంగిక దాడి జరిగిన ఘటన మరువక ముందే హైదరాబాద్ లో మరో అమానుషం చోటుచేసుకుంది. పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జర్మనీకి చెందిన ఓ యువతిపై కొంతమంది యువకులు గ్యాంగ్ రేప్ కు పాల్పడ్డారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. రోడ్డు వెంట నడుచుకుం టూ వెళ్తున్న జర్మనీ యువతిపై కారులో వెళ్తున్న కొంతమంది ఆకతాయిలు కన్నే శారు. ఈ క్రమంలోనే మీర్ పేట ప్రాంతం లోని మందమల్లమ్మ సెంటర్ వద్ద లిఫ్ట్ ఇస్తామని నమ్మించి ఆమెను కారులో ఎక్కించుకున్నారు. అనంతరం యువతిపై కారులోనే సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం వారి నుంచి తప్పించుకున్న యువతి పహాడీ షరీఫ్ పీఎస్ కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

## నేటితో పదవ తరగతి పరీక్షలు ముగింపు



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 01**

రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు గత నెల 21న మొదలై నేటితో సాంఘిక శాస్త్రం పరీక్ష ముగియనుంది. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పర్యవేక్షణ జరుగుతున్న పదో తరగతి పరీక్షలు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నీటి వసతి, వైద్య ఏఎన్ఎమ్లతో ఎలాంటి చూచిరాత జరగకుండా కఠిన నియమ నిబంధనలతో పదో తరగతి పరీక్షలు నేటితో ముగుస్తున్నాయి.

## నేడు ఢిల్లీలోని జంతర్ మంతర్ లో జరిగే బీసీల పోరు గర్జన సభాస్థలిని పర్యవేక్షిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 01:**

బీసీలకు స్థానిక సంస్థల్లో మరియు విద్యా ఉద్యోగ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని యధావిధిగా పార్లమెంట్లో చట్టం చేయాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేడు జరిగే బీసీల పోరు గర్జన సభాస్థలి వేదికను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పరిశీలించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ బీసీల యొక్క న్యాయమైన డిమాండ్ల కోసం హైదరాబాదు నుండి ప్రత్యేక రైలులో ఢిల్లీకి చేరుకోవడం జరిగిందని ఈ యొక్క పార్లమెంటు సమావేశాల్లోనే వాటికి చట్టం చేయాలని అలా చేయని పక్షంలో బిజెపి పార్టీని బీసీల ద్రోహుల పార్టీగా పరిగణిస్తామని పేర్కొన్నారు.

## తిరుమలలో చెల్లని తెలంగాణ అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 1:**

దర్శనం కోసం ఎమ్మెల్యే లేఖతో వెళ్లి నిరాశతో వెనుదిరుగుతున్న భక్తులు సోమవారం, మంగళవారం తెలంగాణ ఎమ్మెల్యేల వీఐపీ లెటర్లు అనుమతిస్తామని టీటీడి ప్రకటించందిని, ఎమ్మెల్యేల లెటర్లు తీసుకొని వస్తే ఇక్కడ ఎవరు పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు, దీంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు,అంతే కాకుండా మీడియా తో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన లేఖలను అనుమతి ఇస్తామని చెప్పిన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు మాత్రం తెలంగాణ సర్కార్ లేఖలకు స్పందించడం లేదన్నారు, దీనిపై తెలంగాణ ప్రభుత్వం అనేక సార్లు ఏపీ ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు

## తారామతి పేట్ లో సన్నబియ్యం పంపిణి కార్యక్రమం



**వెలుతురు,అబ్దుల్లా పూర్ మెట్,ఏప్రిల్ 1:**

తెలంగాణ రాష్ట్రములో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టత్మింగా ఏర్పాటు చేసిన సన్నబియ్యం కార్యక్రమం ను మంగళ వారం నాడు తారామతి పేట్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు మూల కిరణ్ కుమార్ గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు,ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అబ్దుల్లాపూర్ మెట్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మిడయా కో ఆర్డినేటర్ మూల ప్రవీణ్ కుమార్ గౌడ్, దుబ్బ రమేష్ గౌడ్, నంగునూరి ధనరాజ్ సాగర్, మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,



మంగళవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్ డివిజన్లోని రాజ్ మొహల్లా లో పర్యటించి అక్కడున్న సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాము, నరేందర్, జానకిరామ్, నర్సింగ్ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 01:**

## వంశీ రిమాండ్ 15 వరకు పొడిగింపు



**విజయవాడ,ఏప్రిల్1( వెలుతురు):**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ కేసులో ఈ రోజు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి.. వల్లభనేని వంశీ రిమాండ్‌ను జిల్లా కోర్టు పొడిగించింది.. ఆత్కురులో 9 ఎకరాలు కబ్జా చేసేందుకు ప్రయత్నించారని నమోదైన కేసులో వల్లభనేని వంశీకి రిమాండ్ పొడిగించింది. వంశీ రిమాండ్‌ను ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు- ప్రకటించింది.. మరోవైపు, వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా వేసింది.. గన్నవరంలో సీతామహాలక్ష్మి అనే మహిళ స్థలం కబ్జా చేశారన్న కేసులో బెయిల్ ఇవ్వాలని వంశీ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ గురువారానికి వాయిదా వేసింది.. మరోవైపు.. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఏ1గా ఉన్న వంశీ ప్రధాన అనుచరుడు రంగాను సీఐడీ కస్టడీకి ఇచ్చింది న్యాయస్థానం.. దీంతో, బుధవారం నుంచి మూడు రోజుల పాటు రంగను సీఐడీ అధికారులు విచారించనున్నారు.. మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణకు అనుమతి ఇచ్చింది కోర్టు.. కాగా, ఇదే కేసులో ఏ71గా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఉన్నారు,

## హామీల అమలులో రేవంత్ విఫలం

- ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు




**హైదరాబాద్,ఏప్రిల్1( వెలుతురు):**
రైతు భరోసా అమలు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తన మాటను నిలబెట్టుకోలేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మాట తప్పడం, రైతులను మోసం చేయడం రేవంత్ రెడ్డికి అలవాటు-గా మారిందని ఆయన ధ్వజమెత్తారు. జనవరి 26న రైతు భరోసా కింద ఇచ్చే డబ్బులను మార్చి 31లోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఆ హామీ ఇంకా నెరవేరలేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి 31 కల్లా రైతులందరికీ రైతు భరోసా అందజేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఏప్రిల్ 1వ తేదీ వచ్చేసినా ఆ నిధుల గురించి ఎలాంటి ప్రకటన రాలేదని ఆయన మండిపడ్డారు. ఉగాది పండుగను పురస్కరించుకుని రైతులు రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూశారని, అయితే వారికి ప్రభుత్వం చేదు అనుభవం మిగిల్చిందని హరీష్ రావు విమర్శించారు. దసరాకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, సంక్రాంతికి అందిస్తామన్నా నిధులు రాలేదని, ఉగాది నాటికి కూడా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం బాధాకరమన్నారు. కాలండర్లు మారుతున్నా రేవంత్ రెడ్డి మాట మాత్రం మారడం లేదని ఎద్దేవా చేశారు. నాట్ల సీజన్‌లో కేసీఆర్ రైతులకు రైతు బంధు అందించారని, కానీ రేవంత్ రెడ్డి కోతల సమయం వచ్చినా రైతు భరోసా అందించలేకపోయారని హరీష్ రావు ఆరోపించారు. మోసపూరిత పాలననే విధానంగా మార్చుకున్న రేవంత్ రెడ్డి రైతులను అన్ని కోణాల్లో దగా చేస్తున్నారని ఆరోపించారు.రుణమాఫీ వాగ్దానం ఇంకా నెరవేరలేదు. ఇందిరమ్మ భరోసా పథకం కేవలం మాటలకే పరిమితమైంది. హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగానే, అసెంబ్లీలో ప్రకటించినట్లుగానే రైతు భరోసా నిధులు అందించే వరకు బీఆర్ఎస్ పార్టీ రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటు-ంది. ప్రజల్లో మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుందని హరీష్ రావు హెచ్చరించారు.

## లక్ష్మీపార్వతికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ, ఏప్రిల్ 1, ( వెలుతురు)**
వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీపార్వతికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బసవతారకం ట్రస్టుకు మేనేజింగ్ ట్రస్టీగా తనను నియమించాలని కోరుతూ 2009లో దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. 1995 నవంబర్ 18న ఎన్టీ రామారావు రాసిన సప్లిమెంటరీ విల్లుపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దిగువ కోర్టు చట్ట ప్రకారం వ్యవహరించలేదని కోర్టు తెలిపింది. సప్లిమెంటరీ విల్లును నిరూపించే క్రమంలో సిటీ సివిల్ కోర్టు సరైన పద్ధతిలో వెళ్లలేదని హైకోర్టు స్పష్టం చేసింది. విల్లుపై సంతకం చేసిన సాక్షి జె. వెంకటసుబ్బయ్య వారసుడు జె.వి. ప్రసాద్‌రావును సాక్షిగా దిగువ కోర్టు గుర్తించింది. 2018లో దిగువ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేయగా.. తాజాగా దీనిని హైకోర్టు కొట్టివేసింది.వెంకటసుబ్బయ్య, వై. తిరుపతిరావుకు సమన్లు ఇవ్వకుండా వారి వారసులను సాక్షులుగా స్వీకరించడం చెల్లదని హైకోర్టు తెలిపింది. వారు చనిపోయినట్లు ఎలాంటి ఆధారాలు లేవని.. విల్లుపై సాక్షి సంతకం చేసిన వెంకట సుబ్బయ్య మరణించినట్లు నోటి మాట ద్వారా తెలుసుకుని ఆయన కుమారుడు జె.వి. ప్రసాద్‌రావును సాక్షిగా గుర్తించడం సరికాదని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది1995లో రామారావు రాసినట్లు చెబుతున్న సప్లిమెంటరీ విల్లు ప్రకారం బసవతారకం ట్రస్టుకు తనను మేనేజింగ్ ట్రస్టీగా నియమించాలని లక్ష్మీపార్వతి 2009లో సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.. సప్లిమెంటరీ విల్లులో సంతకం చేసిన వెంకట సుబ్బయ్య చనిపోవడంతో ఆయన కుమారుడు ప్రసాద్‌రావును సాక్షిగా గుర్తించాలని లక్ష్మీపార్వతి కోరారు. తన తండ్రి వెంకట సుబ్బయ్య మరణించారని.. అలాగే రామారావు విల్లు రాసిన విషయం నిజమేనని.. తన తండ్రి తనకు సమాచారం ఇచ్చినట్లుగా ప్రసాద్‌రావు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీంతో దిగువ కోర్టు ప్రసాద్‌రావును విచారించేందుకు అంగీకరించింది. అయితే, ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ బసవతారకం ట్రస్ట్, నందమూరి బాలకృష్ణ, నందమూరి హరికృష్ణలు హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది.

# 2026 నాటికి నక్సలిజం నిర్మూలనే లక్ష్యం

- నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య ఆరుకు చేరిక
- హోంమంత్రి అమిత్ షా వెల్లడి



**న్యూఢిల్లీ,ఏప్రిల్1( వెలుతురు):**
2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా నిర్మూలిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గినట్లు వెల్లడించారు. నక్సల్ రహిత భారత్‌ను నిర్మించే దిశగా మనం మరో మైలు రాయిని చేరుకున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో గత కొన్ని రోజులుగా వరుస ఎన్‌కౌంటర్‌లు చోటు- చేసుకుంటున్న విషయం తెలిసిందే. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ కాల్పుల్లో అనేక మంది మావోలు హతమవుతున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతపై అమిత్ షా తాజాగా స్పందించారు. దేశంలో నక్సలిజాన్ని అంతం చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం కఠినమైన విధానాన్ని అవలంభిస్తున్నట్లు చెప్పారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారని.. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. భారత్‌లో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గాయి. తద్వారా కొత్త మైలురాయిని సాధించాం. మోదీ ప్రభుత్వం నక్సలిజం పట్ల కఠినమైన విధానాన్ని అవలంబిస్తోంది. మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి కృషి చేస్తున్నాము. 2026 మార్చినాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తాం' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన నివేదికల ప్రకారం.. దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉన్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం..2015లో ఇవి 35 ఉండగా..2018 నాటికి 30కి తగ్గాయి. 2021నాటికి 25కు వచ్చాయి. తాజాగా వాటి సంఖ్య 6కు చేరింది. మరోవైపు రాష్ట్రంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించేందుకు అమిత్ షా ఈనెల 4, 5 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించ నున్నారు. ఈ సందర్భంగా ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కార్యకలాపాలను సమీక్షించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అనంతరం షా ఏప్రిల్ 7, 8 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో కూడా పర్యటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# వెన్నాడిన అమెరికా టారిఫ్ భయాలు

- భారీ నష్టాలతో ముగిసిన సూచీలు
- 1400 పాయింట్లకు పైగా క్షీణించిన నిఫ్టీ



**న్యూఢిల్లీ,ఏప్రిల్1( వెలుతురు):**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. అమెరికా టారిఫ్‌లు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకు పైగా క్షీణించగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.5 లక్షల కోట్లు- క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1390.41 పాయింట్ల నష్టంతో 76,024.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 353.65 పాయింట్ల నష్టంతో 23,165 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీ-కి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చనే అంచనాలతో ఐటీ- స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ-, హెచ్‌సీఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీ-వల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీ-వల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరిగాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను డీలాపడేలా చేశాయి. వొడాఫోన్ ఐడియాలో వాటాను పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు నేడు 20 శాతం మేర రాణించాయి. స్పెక్ట్రమ్ కోసం వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన మొత్తానికి సంబంధించి తాజాగా ఈక్విటీ- షేర్లను ప్రభుత్వానికి కేటాయిస్తున్నట్లు- సంస్థ తెలిపింది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 22.6 శాతం వాటా ఉండగా.. అది తాజాగా 49 శాతానికి పెరిగింది.

# రాజకీయ లబ్ది కోసం లేనిపోని ఆరోపణలు

- ప్రభుత్వాన్ని అప్రతిష్ట చేసే యత్నాలు
- బిజెపి, బిఆర్ఎస్ ఉమ్మడిగా కుట్రలు
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శలు



**హైదరాబాద్,ఏప్రిల్1( వెలుతురు):**
ఎటువంటి పరిస్థితుల్లోనూ సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు నష్టం కలిగించే ప్రయత్నం చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోరని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రతీ విషయాన్ని రాజకీయం చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే కుట్ర బీజేపీ, బీఆర్ఎస్ కలసికట్టుగా చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటు-న్నారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందే రాష్ట్రంలో భూములు ఆదాయ వనరుగా మారాలని ప్రభుత్వం భావిస్తోందని, విద్యార్థులకు ఏమాత్రం నష్టం కలగకుండా ప్రభుత్వ విధానాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పక్కన ఉన్న సర్వే నెంబర్ 25లో గల 400 ఎకరాల భూమిని సీఎం రేవంత్ రెడ్డి కోర్టులో పోరాటం చేసి సాధించారని అద్దంకి దయాకర్ తెలిపారు. చట్టాలను గౌరవిస్తూ, న్యాయపరమైన మార్గంలోనే భూమిని రాబట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. ఈ భూమిని అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్, కేటీఆర్ ఈ భూములను వేలం వేసి ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించాలని చూశారని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిందని అద్దంకి దయాకర్ గుర్తుచేశారు. అందువల్లే ఈ భూమి ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలో ఉందని, విద్యార్థులకు నష్టం కలగకుండా రేవంత్ రెడ్డి అన్ని జాగ్రత్తలు తీసుకుంటు-న్నారని తెలిపారు. 1970లలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఐఈ÷ఖ కోసం 2500 ఎకరాల భూమిని కేటాయించారని అద్దంకి దయాకర్ తెలిపారు. కానీ ఇప్పుడు కొన్ని రాజకీయ పార్టీలు విద్యార్థుల భావోద్వేగాలను రెచ్చగొట్టి తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఈ విషయాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తున్నాయని అద్దంకి దయాకర్ ఆరోపించారు. విద్యార్థులను సెంటిమెంట్‌తో రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రభుత్వంపై నెగటివ్ ప్రచారం చేయడమే వారి లక్ష్యమని అన్నారు. బీఆర్ఎస్ అనుబంధ సంఘాలు బ్యాక్‌గ్రౌండ్‌లో జేసీబీలు, వన్యప్రాణులు ఉన్నట్లు- సోషల్ మీడియాలో కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అద్దంకి దయాకర్ తెలిపారు.

## సన్నబియ్యంపై క్రెడిట్ వార్...

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ( వెలుతురు)**
తెలంగాణలో పేదల కడుపు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకంపై రాజకీయ వివాదం రేగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా హుజూర్‌నగర్‌లో ప్రారంభించారు. 'పేదలు కూడా శ్రీమంతుల్లా సన్న బియ్యం తినాలనే ఆలోచనతో ఈ పథకం తెచ్చామని' ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే రేషన్ షాపుల విధానం, బియ్యం సరఫరా పథకాలు మొదలయ్యాయని, గతంలో సీఎం కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి) రూ.90 పైసలకే కిలో బియ్యం ఇచ్చారని రేవంత్ గుర్తు చేశారు. ఈ పథకం చరిత్రలో నిలిచిపోతుందని, భవిష్యత్‌లో ఎవరు అధికారంలోకి వచ్చినా దీన్ని కొనసాగించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హుజూర్‌నగర్‌లో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్.. శ్రీమంతుల తరహాలో పేదలు కూడా సన్నబియ్యం తినాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఎన్టీఆర్ కంటే ముందు కాంగ్రెస్ సీఎం కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి పేదలకు రూపాయి 90 పైసలకే కిలో బియ్యం ఇచ్చే పథకాన్ని ప్రారంభించారన్నారు సీఎం రేవంత్. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ ఈ పథకాన్ని కొనసాగించారని తెలిపారు. తాము తీసుకొచ్చిన సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని.. చరిత్రలో ఎవరు సీఎం అయినా ఈ పథకం కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు సీఎం రేవంత్.

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల కోసమే ఆలోచిస్తుందని.. అందుకే వారి ఆకలి తీర్చేందుకు ఈ పథకం తెచ్చామని సీఎం రేవంత్ తెలిపారు. సోనియాగాంధీ ఆహార భద్రతా చట్టం తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారని కామెంట్ చేశారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పథకంలోని మెజార్టీ ఖర్చు భరిస్తోంది కేంద్రమే అన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఒక్కో కిలోకు రూ.40లు కేంద్రం చెల్లిస్తోందన్నారు. సన్న బియ్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై కిలోకు పడే భారం 10 మాత్రమేనన్నారు. రేషన్ షాపుల్లో కనీసం మోదీ ఫోటో కూడా పెట్టడం లేదన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు కేంద్రం ఎంత ఖర్చు చేస్తోంది.. రాష్ట్రం ఎంత ఇస్తోందనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.పేదలకు బియ్యం పంపిణీ సహా ఇప్పుడు సన్న బియ్యం పంపిణీ వరకు అన్ని పథకాలు కాంగ్రెస్ హయాంలోనే మొదలయ్యాయని కాంగ్రెస్ చెబుతుంటే.. ఈ పథకం అమలు కోసం కేంద్రమే ఎక్కువ ఖర్చు చేస్తోందని బీజేపీ అప్పుడే కౌంటర్ ఇవ్వడం స్టార్ట్ చేసింది. దీంతో రాబోయే రోజుల్లో ఈ అంశంపై రెండు పార్టీల మధ్య మరింతగా మాటల యుద్ధం కొనసాగే అవకాశం ఉందనే చర్చ మొదలైంది.సోనియా గాంధీఆహార భద్రతా చట్టం కోసం చేసిన కృషిని కూడా ఆయన కొనియాడారు.అయితే, ఈ పథకం క్రెడిట్‌ను కాంగ్రెస్ తీసుకోవాలని చూస్తుండగా, బీజేపీ దీనికి కౌంటర్ ఇచ్చింది. కేంద్రమంత్రి బండి సంజయ్ 'సన్న బియ్యం పథకంలో ఎక్కువ ఖర్చు కేంద్రమే భరిస్తోంది.

కిలోకు రూ.40 కేంద్రం ఇస్తుండగా, రాష్ట్ర భారం కేవలం రూ.10 మాత్రమే' అని పేర్కొన్నారు. రేషన్ షాపుల్లో ప్రధాని మోదీఫోటో కూడా పెట్టడం లేదని, పేదల కోసం కేంద్రం చేస్తున్న ఖర్చును ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఈ వాదనతో బీజేపీ పథకంలో తమ వాటా ఎక్కువగా ఉందని నొక్కి చెబుతోంది. కాంగ్రెస్ మాత్రం, బియ్యం పంపిణీ నుంచి సన్న బియ్యం వరకు అన్ని పథకాలు తమ హయాంలోనే మొదలయ్యాయని, పేదల ఆకలి తీర్చడం తమ లక్ష్యమని చెబుతోంది. దీంతో ఈ అంశంపై రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వివాదం మరింత రాజకీయ రంగు పులుముకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.మంగళవారం నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. వానాకాలంలో కొనుగోలు చేసిన సన్న వడ్లను సీఎంఆర్ కింద మిల్లులకు ఇచ్చిన ప్రభుత్వం, అందులో సగం బియ్యాన్ని జిల్లా గోదాములకు తరలించింది. ఏప్రిల్ కోటా కోసం ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరఫరా ఇప్పటికే మొదలైంది.

# విదేశీ యువతిపై అత్యాచారం

## - దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్1( వెలుతురు):**

రాష్ట్రంలో అత్యాచారాలు బాగాపెరిగిపోతున్నాయి. ఏదోవిధంగా యువతులను నమ్మిస్తున్న యువకులు దారుణాలకు ఒడిగడుతున్నారు. మొన్న ఓ ఆలయానికి వెళ్లిన యువతిని సామూహిక అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. దానిని మరువకముందే హైదరాబాద్ శివారులో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న యువతికి లిఫ్ట్ ఇస్తానని చెప్పి ముగ్గురు యువకులు కార్‌లో ఎక్కించుకున్నారు. అనంతరం మీర్‌పేట్ దగ్గరలోని మందమల్లమ్మ దగ్గర.. సదరు యువతిని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం ఆ జర్మనీ యువతి పహాడీ షరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మీర్‌పేట్ దగ్గర లిఫ్ట్ ఇస్తామని చెప్పి వాళ్లు కార్ ఎక్కించుకున్నట్టు ఆమె కంప్లైంట్లో వివరించింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల్ని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. బాధితురాలు విదేశీ యువతి కావడంతో కేసును మరింత సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధిత యువతిని వైద్య పరీక్షల కోసం హాస్పటల్‌కు తరలించారు పోలీసులు.

# కాంగ్రెస్ అధిష్టానానికి సీనియర్ నేత జానారెడ్డి లేఖ

- **రంగారెడ్డి జిల్లా నాయకులకు కేబినెట్‌లో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, ఏప్రిల్1( వెలుతురు):**



త్వరలోనే తెలంగాణ కేబినెట్ విస్తరణ ఉంటుందని వార్తలు వస్తున్న తరుణంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేబినెట్ విస్తరణలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన నేతలకు కేబినెట్‌లో ప్రాతినిథ్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి లేఖ రాశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయంతో పార్టీకి, ప్రజలకు మేలు జరుగుతుందని తన లేఖలో ప్రస్తావించారు జానారెడ్డి. కేబినెట్ విస్తరణ అంశంపై ఉన్నట్టుండి జానారెడ్డి హైకమాండ్‌కు లేఖ రాయడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కేబినెట్‌లో ప్రాతినిథ్యం లేకపోవడాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అనేకసార్లు బహిరంగంగానే ప్రస్తావించారు. ఈ కోటాలో తనకు కచ్చితంగా మంత్రి పదవి ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఆయనకు చోటు దక్కుతుందా ? లేదా ? అన్నది సస్పెన్స్‌గా మారింది. కేబినెట్‌లో ఆరు ఖాళీలు ఉండగా.. ప్రస్తుతం నాలుగు స్థానాలను భర్తీ చేయాలని హైకమాండ్ భావిస్తున్నట్టు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నాలుగు కోసం సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఆది శ్రీనివాస్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి పోటీపడుతున్నారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఒకవేళ ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల వారికి అవకాశం ఇస్తే.. మల్ రెడ్డి రంగారెడ్డికి ఛాన్స్ ఉంటుందని.. అదే జరిగితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఉండకపోవచ్చనే టాక్ ఉంది. అయితే అనేక సామాజిక, రాజకీయ కోణాల్లో లెక్కలు వేసుకున్న తరువాత కేబినెట్ విస్తరణ ఉంటుంది.. కాబట్టి తుది జాబితాలో ఎవరికి అవకాశం ఉంటుందో చెప్పడం కష్టమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# హైదరాగూడ క్వాటర్స్ వద్ద పోలీసుల మోహరింపు

- **పలు పార్టీల పిలుపు నేపథ్యంలో అధికారుల చర్యలు**

**హైదరాబాద్, ఏప్రిల్1( వెలుతురు):**

హెచ్‌సీయూకు వెళ్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించిన సందర్భంగా హైదర్‌గూడ క్వాటర్స్ వద్ద పోలీసులు మోహరించారు. మంగళవారం వర్సిటీకి వెళ్లాలని బీజేపీ ఎమ్మెల్యేలు, నేతల బృందం నిర్ణయించింది. హెచ్‌సీయూ భూముల వేలాన్ని బీజేపీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. పలువురు బీజేపీ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే హెచ్‌సీయూ మెయిన్ గేట్ దగ్గర ధర్నాకు సీపీఎం పిలుపునిచ్చింది. 400 ఎకరాల భూమి విషయంలో వివాదం కొనసాగుతోంది. మరోవైపు హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్ద కూడా బలగాలను మోహరించారు. అలాగే హెచ్‌సీయూ భూములపై విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. తరగతుల బహిష్కరణకు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. హెచ్‌సీయూ భూముల అమ్మకానికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే సీపీఎం పార్టీ ఆధ్వర్వంలో హెచ్‌సీయూ వద్ద ఆందోళనకు పిలుపునివ్వగా.. సీపీఐ పార్టీ మాత్రం దీనికి దూరంగా ఉంది. సీపీఐ అనుబంధ విద్యార్థి సంఘాలు అన్నీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకొస్తున్నాయి. అలాగే హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని బీఆర్ఎస్ పార్టీ కూడా ఖండించింది.

కాంగ్రెస్ సర్కార్ ఆచీతూచి వ్యవహరించాలని, ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా రాబోయే తరాలకు ఏం మిగలదని.. దీనిపై సీఎం రేవంత్ పునరాలోచన చేయాలని, వెనక్కి తగ్గాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక బీజేపీ ఆధ్వర్యంలో హైదర్‌గూడ క్వార్టర్స్ నుంచి హెచ్‌సీయూ వద్దకు వెళ్లి నిరసన చేయాలని నిర్ణయించింది. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒక బృందంలా ఏర్పడి హైదర్‌గూడ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బయలుదేరి హెచ్‌సీయూ భూముల వద్దకు చేరుకుని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించింది. అయితే ఎమ్మెల్యేలు వెళ్లేందుకు అనుమతి లేదంటూ పోలీసులు పెద్దఎత్తున హైదర్‌గూడ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు మోహరించారు. ఇప్పటికే ఆ భూములు ప్రభుత్వానివే అంటూ టీజీఐఐసీ ఆధారాలను బయటపెట్టింది. దీనికి సంబంధించి రెండు ప్రకటనలను విడుదల చేసింది. ప్రస్తుతం వివాదం నెలకొన్న భూములను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హెచ్‌సీయూ స్వాధీనం చేసిందని, దానికి బదులుగా వర్సిటీకి సర్కార్.. 397 ఎకరాలను బదలాయించిందని స్పష్టం చేసింది. దీనిపై అప్పటి వర్సిటీ రిజిస్ట్రార్ సంతకం చేశారని తెలిపింది. సంబంధిత కాపీలను సీఎంవో విడుదల చేసింది. అయితే కంచగచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అంటూ టీజీఐఐసీ చేసిన ప్రకటనను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఖండించారు.

# ఏటీఎం కార్డు సైజులో రేషన్ కార్డు

- **కెవైసీ ప్రక్రియ ముగిసాక కొత్త కార్డులు జారీ**
- **పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

**అమరావతి,ఏప్రిల్1( వెలుతురు):**

ఈ ఏడాది మే నుంచి ఏటీఎం కార్డు సైజులో కొత్త రేషన్ కార్డులు జారీ చేయబోతున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఏప్రిల్ 30వ తేదీతో ఈ కేవైసీ పక్రియ పూర్తి అయిన వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 44 వేల 394 ప్రభుత్వ పాఠశాలలకు సూపర్ ఫైన్ బియ్యాన్ని మధ్యాహ్న భోజనానికి సరఫరా చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మంగళవారం మంత్రి నాదెండ్ల మనోహర్ సచివాలయంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఫ్యామిలీ రేషన్ కార్డునే సైజు తగ్గించి అన్ని వివరాలతో జారీ చేయనున్నామని స్పష్టం చేశారు. కొత్త కార్డుల జారీ సమయంలోనే కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని తెలిపారు. క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లతో కొత్త రేషన్ కార్డులు జారీ అవుతాయని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలా ఎక్కడా వ్యక్తుల బొమ్మలు రేషన్ కార్డుపై ఉండబోవని స్పష్టం చేశారు. ఈ కేవైసీ పూర్తి అయిన తర్వాత ఎంతమందికి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలో స్పష్టత వస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం నుంచి దీపం 2 రెండో విడత సిలిండర్ బుకింగ్ ప్రారంభమైందని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కొత్తగా 2 లక్షల మంది గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నట్లు– చమురు కంపెనీలు తెలిపాయని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 35 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. రైతుకు ఒక భరోసా ఇస్తూ వారికి 24 గంటల్లోపు వారి ఖాతాల్లో నగదు జమ చేశామని అన్నారు. రూ.8 వేల 279 కోట్లు ధాన్యం కొనుగోలు చెల్లింపులు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. 5 గోదాముల్లో మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించే బియ్యం నిల్వ చేసి ప్యాకింగ్ చేయిస్తున్నామని



తెలిపారు. రబీలోనూ ఖరీఫ్ బియ్యం కొనుగోలు కొనసాగుతుందని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠినంగానే వ్యవహరిస్తున్నామని అన్నారు. పీడీ యాక్టులోనూ రేషన్ బియ్యం స్మగ్లింగ్‌ను చేర్చామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం రూ.1600 కోట్లతో ఎండీయూలు కొనుగోలు చేసి దుర్వినియోగం చేసిందని ఆరోపణలు చేశారు. ఎండీయూల కొనుగోలు ఓ పెద్ద కుంభకోణమని షాకింగ్ కామెంట్స్ చేశారు.దీనిపై విచారణ జరుగుతోందని.. త్వరలోనే ఓ నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేశారు. త జగన్ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లలో కూడా అవినీతి జరిగిందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. రైతులు ధాన్యాలను అమ్ముకునేందుకు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చే పరిస్థితి ఉందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లల్లో వాట్సాప్ , జీపీఎస్‌లను సాంకేతికంగా ఉపయోగిస్తున్నామని తెలిపారు.

రైతులే వారికి నచ్చిన మిల్లుల వద్ద ధాన్యం అమ్ముకునేలా అవకాశం కల్పించామని చెప్పారు. ఈ సీజన్‌లో చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మాటిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ధాన్యం కొనుగోలు చేయలేదని అన్నారు. రబీ సీజన్‌లో రైతులకు ఒక భరోసా కల్పిస్తూ ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బీలో 13 లక్షలు 50 వేల మెట్రిక్ టన్నులు పంట వస్తుందని అంచనా వేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ స్లపై నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఏపీ వ్యాప్తంగా 2900 రైతు సహాయక కేంద్రాలు ఏర్పాటు– చేస్తామని హామీ ఇచ్చారు. 12 వేల మంది సిబ్బంది అందుబాటు–లో ఉంటారని స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపం 2 పథకం అమలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.


దశదినకర్మ

స్వస్తిశ్రీ క్రోధి నామ సం॥ తేది: 23-03-2025
ఆదివారం రోజున సా॥గం॥ 6.30 ని॥లకు
కీ॥శే॥ బొడ్డు పార్వతమ్మ గారు
స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము

తేది: 02-04-2025 బుధవారం రోజున
మా అమ్మ గారి పెద్దకర్మ కార్యక్రమం నిర్వహిస్తునాము

కావున తామెల్లరు విచ్చేసి వారి ఆత్మకు
శాంతి చేకూర్చగలరని కోరుచున్నాము.




కీ॥శే॥ బొడ్డు పార్వతమ్మ గారు
మరణం: 23-03-2025
భర్త: బొడ్డు అంజయ్య గౌడ్

ఇట్లు..
కొడుకులు - కోడళ్ళు
కీ॥శే॥ బొడ్డు స్వామి గౌడ్ - సరోజ
బొడ్డు వెంకటేశం గౌడ్ - శాంత
బొడ్డు నాగరాజు గౌడ్ - శ్రావణి

కూతుర్లు - అల్లుండ్లు
బాలగోని స్వరూప - మాసయ్య గౌడ్
పులిపలుపుల సంధ్య - శ్రీనివాస్ గౌడ్

మనమళ్ళు, మనమరాళ్ళు

కార్యస్థలం: సత్య ఫంక్షన్ హాల్, చండూర్ రోడ్
గ్రా॥ మునుగోడు , మం॥ మునుగోడు



# మళ్లీ ప్రభాస్‌తో నట్టించనున్న దిశాపటాని

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని నెలలుగా రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు డార్లింగ్. ఇదిలా ఉంటే.. డార్లింగ్ సరసన మరోసారి ఛాన్స్ కొట్టేసింది బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ. ఇప్పటికే ప్రభాస్ తో కలిసి ఓ సినిమాలో నటించి మెప్పించింది దిశా పటానీ. కొన్నాళ్లుగా బాలీవుడ్ ఇండస్ట్రీలో సరైన హిట్టు కోసం ఎదురుచూస్తున్న ఈఅమ్మడుకు.. ఇప్పుడు ప్రభాస్ సరసన వరుస ఆఫర్స్ వస్తున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా దిశా పేరు మారుమోగుతుంది. మోడలింగ్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టిన దిశా పటానీ.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని హైలెట్ అయ్యింది. ఆ తర్వాత వరుణ్ తేజ్ సరసన లోఫర్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. కానీ ఈ సినిమా ఫ్లాప్ కావడంతో ఆమె బాలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. హిందీలో వరుస ఆఫర్స్ అందుకుంటూ అక్కడే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. చాలా కాలం తర్వాత ఇటీవల నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి చిత్రంలో ప్రభాస్ జోడిగా కనిపించింది. ఈ మూవీతో పాన్ ఇండియా లెవల్లో మరోసారి పాపులర్ అయ్యింది. ఇక ఇప్పుడు మరోసారి ప్రభాస్ సరసన కనిపించనుందట. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో డార్లింగ్ నటిస్తున్న సినిమాలో ఇమాన్వీ కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మరో హీరోయిన్ దిశా పటానీ కనిపించనుందని అంటునారు.

# శ్రీలీలకు నిరాశను కలిగించిన రాబిన్‌హుడ్



తెలుగులో వరుస హిట్లతో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న యంగ్ హీరోయిన్ శ్రీలీల. బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ టాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్ గా దూసుకుపోయింది ఈ ముద్దుగుమ్మ. ధమాకా సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ సినిమాలో తన ఎనర్జిటిక్ డ్యాన్సులతో అదరగొట్టింది. కానీ ఆ తర్వాత ఈ అమ్మడు ఖాతాలో అదే స్థాయిలో హిట్టు రావడం లేదు. కొన్నాళ్లుగా ఆమె చేస్తున్న ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడుతూనే ఉన్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్?ట్రార్డినరీ మ్యాన్ ఇలా శ్రీలీల నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరుస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన గుంటూరు కారం సినిమాతో ఓ హిట్ పడింది. కానీ ఈ సినిమా శ్రీలీలకు అంతగా క్రేజ్ రాలేదు. ఇక గుంటూరు కారం సినిమా తర్వాత చాలా కాలం గ్యాప్ తీసుకున్న శ్రీలీల.. ఇప్పుడు రాబిన్ హుడ్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. నితిన్ హీరోగా నటించిన ఈ సినిమా ఇటీవలే థియేటర్లలో రిలీజ్ రాగా.. మిశ్రమ స్పందన వచ్చింది. ఈ సినిమాతో శ్రీలీలకు మరోసారి నిరాశే ఎదురయ్యింది. నిజానికి ఈ మూవీలో ముందుగా రష్మిక చేయాల్సింది. కానీ డేట్స్ అడ్జస్ట్ కాకపోవడంతో ఆమె స్థానంలోకి శ్రీలీల వచ్చింది. దీంతో ఇప్పుడు ఈ అమ్మడు ఖాతాలో మరో ఫ్లాపు వచ్చి చేరింది.

# శోభితకు బంపరాఫర్


## తమిళ దర్శకుడు సినిమాలో అవకాశం



అక్కినేని కోడలు, నటి శోభితా ధూళిపాళ్ల బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. పెళ్లికి ముందు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ నాగచైతన్యతో పెళ్లి అనంతరం కొద్దిరోజులు సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మళ్లీ సినీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది ఈ భామ. తమిళ ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఒక సినిమాను తెరకెక్కించబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా శోభితా ధూళిపాళ్లకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. తమిళ అగ్ర దర్శకుడిలలో పా.రంజిత్ ఒక్కడు. అట్టకత్తి మద్రాస్, కబాలి, కాలా, సర్పాట్ట పరంబరై, తంగలాన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ని సంపాదించుకున్నాడు రంజిత్. అయితే తంగలాన్ తర్వాత రంజిత్ వెట్టువం అనే ఒక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో దినేశ్ హీరోగా నటించబోతుండగా.. ఆర్య విలన్ పాత్రలో నటించనున్నాడు. అట్టకత్తి చిత్రం తరువాత వీరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈ సినిమాలోనే శోభితా ధూళిపాళ్లను హీరోయిన్‌గా తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే శోభితకు ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు.

# అందం, అభినయంతో అదరగొడుతున్న పాయల్‌రాజ్‌పుత్

ఆర్ ఎక్స్ 100 సినిమాతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న చిన్నది పాయల్ రాజ్ పుత్. ఈ ముద్దుగుమ్మ తన అందచందాలతో ఎప్పుడూ నెట్టింట్లో తెగ ట్రెండ్ అవుతుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షార్ట్ డ్రెస్ లో తన గ్లామర్ తో కుర్రకారుకు చెమటలు పట్టిస్తుంది. డెమిన్ క్లాత్ తో తయారు చేసిన ఈ డ్రెస్ లో బు అమ్మడు చాలా అందంగా ఉంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. అందాల ముద్దుగుమ్మ పాయల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. చేసిన సినిమాలు తక్కువే అయినా ఈ బ్యూటీ యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆర్ ఎక్స్ 100 సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. మరీ ముఖ్యంగా ఈ సినిమాలో పాయల్ తన గ్లామర్ తో కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. పాయల్ రాజ్ పుత్ మొదటి సినిమా మంచి గుర్తింపు తెచ్చినప్పటికీ అంతగా అవకాశాలు రాలేదు. ఆర్ ఎక్స్ 100 సినిమా తర్వాత పాయల్ డిస్కో రాజా, వెంకీ మామా, అనగనగా ఓ అతిథి, పకపా. మాయాపేటిక,మంగళ వారం వంటి సినిమాల్లో నటించింది. ఈ సినిమాల్లో మంగళవారం మూవీతో మరోసారి ఈ అమ్మడుకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాలో పాయల్ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ బ్యూటీ ఎప్పుడూ తన వరస ఫొటో షూట్ తో నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ నటి, డెమిన్ క్లాత్ తో తయారు చేసిన సింగిల్ పీస్ షాట్ ధరించి తన అందాలతో మత్తెక్కిస్తుంది. డిఫరెంట్ ఫోజులతో ఉన్న ఈ ఫొటోలు నెటిజన్స్ ను తెగ ఆకట్టుకుంటున్నాయి.



# సినిమాలు లేక ఖాళీగా ఉన్న సమయంలో పెళ్లి చేసుకున్నా : అదితి

ఇటీవలి కాలంలో చాలా మంది ముద్దుగుమ్మలు పెళ్లి పీటలెక్కారు. కొందరు లవ్ మ్యారేజ్ చేసుకోగా, మరి కొందరు పెద్దలు చూసిన వ్యక్తిని మనువాడారు. అయితే ఇటీవల నటుడు సిద్ధార్థ్‌ని వివాహం చేసుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది అదితి రావు హైదరి. మహా సముద్రం సినిమాలో హీరోయిన్ గా నటించిన అదితి రావు హైదరి తో షూటింగ్ సమయంలో సిద్దార్థ్ కి పరిచయం కాగా, ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్లింది. ఇరు కుటుంబాల సమక్షంలో వివాహం వైభవంగా జరిగింది. వనపర్తి పెళ్లికి వేదిక అయింది. సిద్ధు, అదితిలు పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో తమ పిక్స్ షేర్ చేసుకుంటూ నువ్వే నా సూర్యుడు, నువ్వే నా చంద్రుడు.. నువ్వు నా తారా లోకం అంటూ మిసెస్ అండ్ మిస్టర్ సిద్ధు అని అదితి రావు ఇన్ స్టా లో పోస్ట్ పెట్టగా, ఆ పోస్ట్ నెట్టింట వైరల్ అయింది. అయితే అదితి తన సినీ ప్రస్థానాన్ని 2006లో మలయాళ చిత్రం "ప్రజాపతి"తో ప్రారంభించింది. ఇందులో ఆమె మమ్ముట్టి సరసన నటించింది. ఇక ఆ తర్వాత వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంది. ఆమె తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంది. హిందీలో "దిల్లీ 6", "రాక్‌స్టార్", "పద్మావత్" వంటి చిత్రాల్లో నటించగా, తెలుగులో "సమ్మోహనం", "మహాసముద్రం" వంటి సినిమాల్లో నటించి అలరించింది. అదితిలో మంచి టాలెంట్ ఉన్నా కూడా ఆమెకి పెద్ద హిట్స్ పడలేదు. ఆమెకి భరతనాట్యం కూడా వచ్చు. చాలా బాగా చేస్తుంది. అయితే హీరమండి సినిమాలో తన నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయంటూ రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది అదితి. హీరామండి తర్వాత తనకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు.. నా నటనకు , డాన్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చిన అవకాశాలు రాకపోవడం బాధ అనిపించింది. అయితే సినిమాలు లేక ఖాళీగా ఉన్న సమయంలోనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నా అని తెలిపింది. ఇక అదితి ఆమె 1978 అక్టోబర్ 28న హైదరాబాద్‌లో జన్మించింది. ఆమె తల్లి విద్యా రావు, ఒక ప్రముఖ శాస్త్రీయ గాయని, తండ్రి ఎహ్సాన్ హైదరి. అదితి రాజకీయంగా ప్రముఖమైన కుటుంబాల నుండి వచ్చింది.



# ప్రభుత్వం విద్యను అమ్మకానికి పెట్టడం బాధాకరం

## సినిమా దర్శకుడు వేణు ఊడుగుల



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పరిధిలోని 400 ఎకరాల భూముల్లో పర్యావరణ విధ్వంసానికి తెగబడుతున్న రేవంత్ ప్రభుత్వంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ విధ్వంసంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు స్పందించారు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ వివాదంపై విరాట పర్వం సినిమా దర్శకుడు వేణు ఊడుగుల స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ.. విశ్వవిద్యాలయ భూమి ప్రస్తుతం ఉన్న విద్యార్థులతో పాటు భవిష్యత్ తరాలకు చెందినది మాత్రమే కానీ అత్యధిక ధరకు చెల్లించే వారికి కాదు. ఈ విషయం పక్కన పెట్టి ప్రభుత్వం విద్యనే అమ్మకానికి పెట్టింది. ఇది అభివృద్ధి కాదు, ఇది మన భవిష్యత్తును తాకట్టు పెట్టడం. విద్యను అందించడానికి ఉన్న స్థలాలను అక్రమంగా అమ్మేస్తుంటే ఈ అన్యాయాన్ని చూస్తూ ఉండలేము. ఈ భూ కబ్జా ఆపాలంటూ వేణు కోరారు.

# దమ్ముంటే నా సినిమా బ్యాన్ చేయండి : నాగవంశీ

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం మ్యాడ్ స్క్వేర్. సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీ టికెట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయని.. సినిమా బాగాలేకున్న మేకర్స్ ఫేక్ కలెక్షన్స్ చూపిస్తున్నారని కామెంట్లు వస్తున్న విషయం తెలిసిందే. పలు వెబ్‌సైట్‌లలో ఈ సినిమాకు నెగిటివ్ రివ్యూలు వచ్చాయి. దీంతో తాజాగా ప్రెస్ మీట్ పెట్టిన నాగవంశీ.. మీడియా జర్నలిస్ట్‌లతో పాటు రివ్యూలు ఇచ్చే పలు వెబ్‌సైట్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ సినిమాకు తక్కువ కలెక్షన్లు వచ్చాయని అంటున్నారు. వారికి నేను సమాధానం చెప్పాలి అనుకుంటున్నా. ఎవరికి తక్కువ కలెక్షన్లు వచ్చాయి అనిపిస్తుందో నా దగ్గరికి రండి వారికి అసలు కలెక్షన్లు చూపిస్తాను. ఇదేమైన పెద్ద హీరో సినిమానా కలెక్షన్లు రాకున్న బయట హౌస్‌ఫుల్ బోర్డ్ పెట్టడానికి.. నాకు అలాంటి అవసరం కూడా లేదు. సినిమా ఆడుతున్నప్పుడు.. ఎందుకు సపోర్ట్ చేయడం లేదు. ఎందుకు నెగిటివ్ రివ్యూలు రాస్తున్నారు. నా మీద అంత పగ ఉంటే దమ్ముంటే నా సినిమాలు బ్యాన్ చేసి చూపించండి. నా సినిమా ఆర్టికల్స్ రాయకండి. నా దగ్గర యాడ్ తీసుకోకండి. అప్పుడు నేను కూడా చూపిస్తాను నా సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో అంటూ నాగవంశీ చెప్పుకోచ్చాడు.



# కంచె గచ్చిబౌలి భూములపై తక్షణమే నివేదిక పంపండి

- అటవీ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఆదేశం
- కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో అటవీ, పర్యావరణ మంత్రిని కలిసిన తెలంగాణ ఎంపీలు
- రిపోర్ట్ వచ్చాక తగిన చర్యలు తీసుకుంటామని హామీ



**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 01:**
హైదరాబాద్ కంచె గచ్చిబౌలి (హెచ్ సీయూ) భూములపై తక్షణమే నివేదికను పంపాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు బండి సంజయ్ కుమార్, డీకే అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జి.నగేశ్, రఘునందన్ రావు తదితరులు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.కంచె గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల పర్యావరణ, హెరిటేజ్ భూములని పేర్కొన్నారు. హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు కంచె గచ్చిబౌలి భూములు ఎంతో ప్రయోజనకరమని ఈ సందర్బంగా వారు భూపేంద్ర యాదవ్ ద్రుష్టికి తీసుకొచ్చారు. అనేక రకాల ఔషధ మొక్కలు, వివిధ పక్షి జాతులతో ఆ ప్రాంతమంతా అలరారుతోందన్నారు. ఇంతటి విలువైన భూములను రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ గా మార్చి వేల కోట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. హెచ్ సీయూ విద్యార్థులతోపాటు యావత్ హైదరాబాద్ ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకుని ఆ భూములను పరిరక్షించాలని కోరారు. ఈ సందర్బంగా సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ కంచె గచ్చిబౌలి భూములపై తక్షణమే నివేదిక ఇవ్వాలని అటవీ, పర్యావరణ శాఖ అధికారులను ఆదేశించారు. నివేదిక అందిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్, మార్చి31( వెలుతురు):**
కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కంచ గచ్చిబౌలి భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. దాంతో రేవంత్ సర్కారుపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# జర్మనీ యువతి పై అత్యాచారయత్నం ఘటనను తీవ్రంగా ఖండించిన బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి

- బాధిత మహిళను పరామర్శించిన బిజెపి మహిళా మోర్చా నాయకులు
- మహిళా భద్రతలో విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఓటుబ్యాంకు రాజకీయాల కోసం నేరస్థులను కాపాడే కుట్రపై తీవ్ర విమర్శలు
- ముస్లిం ఓటుబ్యాంకు కోసం నేరస్థులకు అండ..!
- నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలి.
- మహిళల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 01:**
తెలంగాణలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులపై బిజెపి తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో జర్మనీ యువతిపై జరిగిన అత్యాచారయత్నం ఘటనపై ఆమె తీవ్రంగా స్పందించారు. బాధితురాలిని మీర్ పేట్ కార్పొరేటర్ మల్లేష్, మహేశ్వరం కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీరాములు యాదవ్ గార్లతో కలిసి పరామర్శించి, ఈ విషాద సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో పోలీసు అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా నిందితులను అరెస్ట్ చేయకపోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం నేరస్థులకు స్వర్గధామంగా మారడంతో మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం దురదృష్టకరమన్నారు. ఇటీవల హైదరాబాద్ ఎంఎంటీఎస్ రైలులో ఒంటరిగా ప్రయాణిస్తున్న యువతిపై లైంగికదాడి యత్నం, పహాడీ షరీఫ్‌లో జర్మనీ యువతిపై ముగ్గురు యువకుల అత్యాచారం, బాలీవుడ్ టీవీ నటిపై నగరంలో జరిగిన లైంగిక దాడి, నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండపేట అంజన్న ఆలయం వద్ద యువతిపై ఆకతాయిల దాడి లాంటి ఘోరమైన ఘటనలు



రోజురోజుకూ పెరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు నిందితులను అరెస్ట్ చేయడంలో అప్రమత్తంగా వ్యవహరించడం లేదని శిల్పారెడ్డి ఆరోపించారు. ఓవైపు అధికార పార్టీ అండతో, రాజకీయాల ముసుగులో నేరస్థులు నేడు మహిళల జీవితాలతో ఆటలాడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. జర్మనీ యువతిపై అత్యాచారయత్నం ఘటనలో ముస్లిం వర్గానికి చెందిన నిందితులకు వత్తాసు పలకడం అన్యాయమని శిల్పారెడ్డి తీవ్రంగా స్పందించారు. స్వార్ధ రాజకీయాల కోసం నేరస్థులను రక్షించడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ అని మండిపడ్డారు. మహిళా భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను సరైన విధంగా నిర్వహించడం లేదని ఆరోపించారు.

## బిజెపి మహిళా మోర్చా డిమాండ్లు:

మహిళలపై దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి.
హైదరాబాద్‌లో మహిళా భద్రత కోసం పోలీసు పెట్రోలింగ్‌ను పెంచాలి.
ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకొని బాధితులకు తక్షణ న్యాయం చేయాలి.
మహిళా భద్రత కోసం స్పెషల్ టాస్క్ ఫోర్స్ విస్తృతంగా పనిచేయాలి.
సీసీటీవీ నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి, రైల్వే, బస్టాండ్లలో ప్రత్యేక భద్రత కల్పించాలి.

ఇప్పటికైనా జర్మనీ మహిళపై అత్యాచారయత్నం కేసులో నిందితులను వెంటనే పట్టుకుని, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. నిందితులను రక్షించేందుకు ప్రభుత్వం కుట్రలు చేయడం మానుకోవాలని.. న్యాయం కోసం బిజెపి పోరాడుతుందని శిల్పారెడ్డి తేల్చిచెప్పారు.

# 5నుంచి ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు

- ఘనంగా కోయిళ్ ఆళ్వార్ తిరుమంజనం

**కడప,ఏప్రిల్1( వెలుతురు):**
ఒంటిమిట్ట ఏకశిలానగరంలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో ఏప్రిల్ 5 నుండి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విదితమే. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం



చేశారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుండి సర్వదర్శనానికి అనుమతించారు. ఒంటిమిట్ట ఏకశిలానగరంలో జగదభి రామయ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం అవుతోంది. రామయ్య వార్షిక బ్రహ్మోత్సవాలు జరగబోతున్నాయని టీటీడీ అధికారులు ప్రకటించారు.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు భారీగా నిర్వహిస్తున్నామన్నారు. కోదండ రామయ్య బ్రహ్మోత్సవాల ముందు, కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని..అన్నారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు కోయిల్ ఆల్వార్ కార్యక్రమం పూర్తి చేశారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com